అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 18 మే 2024 పేజీలు : 04



# ఎవరు గెలిచినా మినిస్టరే..

**- బాలయ్య, దీపికలో అదృష్టం ఎవరిదో**
**- జగన్ వ్యాఖ్యలతో వైసిపిలో పెరిగిన ధీమా**




నోట్ : సార్ బాలయ్య, దీపిక ఫోటోలు, కుర్చీ ఫోటో

**హిందూపురం, మే 17 ప్రభాతవార్త**

దాదాపు 25 ఏళ్ల తరువాత హిందూపురానికి మంత్రి పదవి వచ్చే అవకాశాలు ఈ సారి పక్కాగా కనిపిస్తున్నాయి. ఏపి రాజకీయాల్లోనే ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాంతం ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠత నెలకొంది. సెలబ్రిటీ, మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసిన నందమూరి బాలకృష్ణకు తొలిసారి బిసి మహిళగా రంగంలోకి దిగిన అధికార వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కురుబ దీపిక అన్యూహ్యంగా గట్టి పోటీ ఇచ్చింది. ఇద్దరిలో గెలుపు ఎవరిది అనే చర్చ టి-20 క్రికెట్ పోటీ ఫలితాలను తలపిస్తోంది. జూన్ 4న ఓట్ల లెక్కింపులో బాలయ్య హ్యాట్రిక్ కొడతాడా, లేక టిడిపి కంచుకోటను దీపికి ధ్వంసం చేస్తుందా అనేది డిసైడ్ కానుంది. ఇదిలా వుండగా ఈ ఇద్దరిలో ఎవరు గెలిచినా మంత్రి పదవి రావడం ఖాయమని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. 1996 నుండి 99 వరకు రాష్ట్ర రవాణాశాఖామంత్రిగా నందమూరి హరికృష్ణ పనిచేసిన తరువాత చంద్రబాబు విధానాలు నచ్చక టిడిపికి గుడ్‌బై చెప్పి అన్నా టిడిపి పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. ఆ తరువాత టిడిపి నుండి గెలుపొందిన ఎమ్మెల్యేలు మంత్రి పదవులు ఎంపిక దరిదాపుల్లోకి రాలేకపోయారు. ప్రస్తుతం టిడిపి, మిత్రపక్షాలు అధికారంలోకి వస్తే బాలయ్యకు క్యాబినెట్ మంత్రి పదవి ఖాయమని ఆ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. 2014లో తొలిసారి ఎమ్మెల్యే అయిన బాలయ్య అప్పట్లో హిందూపురం మీడియా సమావేశాల్లో పలుమార్లు తనకు మంత్రి పదవి వస్తుందని తన మనసులోని ఆకాంక్షను బాహటంగానే వ్యక్తం చేశారు. అయితే బావ చంద్రబాబు మొండి చేయి చూపడంతో చేసేదేమిలేక బాలయ్య మౌనంగా వుండిపోయారు. నందమూరి కుటుంబాన్ని ముందు నుండి నారా కుటుంబం రాజకీయంగా అణగదొక్కుతూనే వుందన్న ఆక్రోశం నందమూరి అభిమానుల్లో రగులుతూనే వుంది. అయితే ఈ సారి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం వస్తే గనుక చంద్రబాబు మరోసారి బాలయ్యకు అన్యాయం చేసే సాహసం చేయకపోవచ్చని పేర్కొంటున్నారు. మరోవైపు ఐదేళ్లపాటు సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం అమలు చేసి చూపించినందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం భారీగా పెరిగిందని మరోసారి ప్రజాదరణ పొందవచ్చని ఎగ్జిట్ పోల్స్ అనధికారికంగా వెల్లడిస్తున్న ఫలితాల క్రమంలో హిందూపురంలో కురుబ దీపిక జయభేరి మోగించనుందని వివిధ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అదే గనుక జరిగితే 40 ఏళ్ల పాటు ఏపిలో ఎక్కడలేని విధంగా తెలుగుదేశం పార్టీ హిందూపురంలో చేస్తున్న జైత్రయాత్రకు బ్రేక్ పడుతుంది. విప్లవాత్మక సంక్షేమ పథకాలతో నేరుగా లబ్దిదారుల అకౌంట్లకు డిబిటి విధానం ద్వారా నగదు జమ చేస్తున్న జగన్ మళ్లీ సిఎం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఓటుతో పోటెత్తారని పలువురు అంచనాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో మళ్లీ వైసిపి సర్కారు కొలువుదీరితే తొలి క్యాబినెట్‌లోనే హిందూపురం నుండి కురుబ దీపికకు మంత్రి పదవి రావడం తథ్యమని ఆ పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. మంత్రి పదవి ఇవ్వడం ద్వారా హిందూపురం ప్రాంతంలో ఇటు పార్టీని పూర్తి స్థాయిలో బలోపేతం చేయడం, అటు తెలుగుదేశం పార్టీ అధిపత్యానికి చెక్ పట్టేందుకు సిఎం జగన్ వ్యూహాత్మక ఎత్తు గడులు వేసే అవకాశం వుంది.

# 24వతేదీ నుండి వేరుశనగ విత్తన పంపిణీ

**- 18వతేదీ నుండి రైతు భరోసా కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ మొదలు పెట్టాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్**




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



హాజరైన అధికారులు

**అనంతపురం కలెక్టరేట్, మే 17 ప్రభాతవార్త**

ఈ నెల 24వతేదీ నుండి వేరుశనగ విత్తన పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సర్వం సిద్ధంగా వుండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో వేరుశనగ విత్తన పంపిణీ-2024పై ఏడిఏలు, ఏఒలు, బ్యాంకర్లు, తదితర వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 24వతేదీ నుండి వేరుశనగ విత్తన పంపిణీ జరగాలన్నారు. 18వతేదీ నుండి జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ మొదలు పెట్టాలన్నారు. విత్తన పంపిణీని వ్యవసాయశాఖ అధికారుల పర్యవేక్షణలో చేయాలన్నారు. జిల్లాలోని అర్హులైన ప్రతి రైతుకు విత్తనాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న, సన్నకారు, కౌలు రైతులకు విత్తన పంపిణీలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు విత్తన పంపిణీపై అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా విత్తనాలు సిద్ధంగా వుంచాలని ఆదేశించారు. విత్తన పంపిణీని కంట్రోల్ రూమ్ నుండి మానిటర్ చేయాలని ఏపి సీడ్స్ డిఎం, జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల జాబితా షెడ్యూల్ చేసి రైతులకు తెలియచేయాలన్నారు. అడిన వారికి అడిగిన విత్తనాన్ని పంపిచాలన్నారు. ఏడిఏలు, వ్యవసాయాధికారులు రైతు భరోసా కేంద్రాల్లో సమావేశాలు పెట్టి ఏ రకమైన విత్తనం కావాలో తెలుసు కోవాలన్నారు. ఈ నెల 19వతేదీ లోపు ఇందుకు సంబంధించి నివేదిక అందించాలన్నారు. వర్షాలు వస్తున్న నేపథ్యంలో రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాన్ని జాగ్రత్తగా నిల్వ చేయాలన్నారు. సిసిఆర్‌పి కార్డులు మరింత మంది రైతులకు అందించేలా చూడాలని వారికి బ్యాంకుల నుండి పంట రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తగా వేరుశనగ విత్తన పంపిణీకి అన్ని విధాల సిద్ధంగా వుండాలని కలెక్టర్ ఆదేశించారు.

**జిల్లా స్థాయిలో సీడ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు :**

జిల్లాలో విత్తన పంపిణీ మానిటరింగ్ కోసం సీడ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు విత్తన పంపిణీలో ఏవైనా సమస్యలు వుంటే కలెక్టరేట్‌లోని సీడ్ మానిటరింగ్ సెల్ నెంబర్ 08554-232922, 08554-231922కు ఫోన్ చేసి తెలియచేయాలన్నారు. 0-05 ఎకరాలు వున్న రైతుకు 30 కిలోల బస్తా ఒకటి, 0.5 నుండి 1.0 ఎకరాలు వున్న రైతుకు 30 కిలోల బస్తాలు రెండు, 1.01 ఎకరాల కన్నా ఎక్కువ వున్న వారికి 30కిలోల బస్తాలు 3 పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కె-6 మరియు-1694 రకం విత్తనానికి సంబంధించి 30 కిలోల బస్తా పూర్తి ధర 2,850 రూపాయలు కాగా, సబ్సిడీ 1,140 రూపాయలు పోగా రైతు 1,710 రూపాయలు చెల్లించాలన్నారు. కె-6 మరియు-1694 రకం విత్తనానికి సంబంధించి 60 కిలోల 2 బస్తాల పూర్తి ధర 5,700 రూపాయలు కాగా, సబ్సిడీ 2,280 రూపాయలు పోగా రైతు 3,420 రూపాయలు చెల్లించాలన్నారు. కె-6 మరియు-1694 రకం విత్తనానికి సంబంధించి 90 కిలోల 3 బస్తాల పూర్తి ధర 8,550 రూపాయలు కాగా, సబ్సిడీ 3,420 రూపాయలు పోగా రైతు 5,130 రూపాయలు చెల్లించాలన్నారు. కదిరి లేపాక్షి (కె-1812) రకం విత్తనానికి సంబంధించి 30 కిలోల బస్తా పూర్తి ధర 2,610 రూపాయలు కాగా, సబ్సిడీ 1,044 రూపాయలు పోగా రైతు 1,566 రూపాయలు చెల్లించాలన్నారు. కదిరి లేపాక్షి (కె-1812) రకం విత్తనానికి సంబంధించి 60 కిలోల 2 బస్తాల పూర్తి ధర 5,220 రూపాయలు కాగా, సబ్సిడీ 2,088 రూపాయలు పోగా రైతు 3,132 రూపాయలు చెల్లించాలన్నారు. కదిరి లేపాక్షి (కె-1812) రకం విత్తనానికి సంబంధించి 90 కిలోల 3 బస్తాల పూర్తి ధర 7,830 రూపాయలు కాగా, సబ్సిడీ 3,132 రూపాయలు పోగా రైతు 4,698 రూపాయలు చెల్లించాలని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహులు, ఏపి సీడ్స్ డిఎం సుబ్బయ్య, వ్యవసాయ అధికారి రాకేష్, ఏడిఏలు, ఏఒలు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఫలితంపై పెరిగిన ఉత్కంఠ

**- సర్వత్రా చర్చనీయాంశంగా మారిన తాడిపత్రి - గెలుపుపై ప్రధాన పార్టీల ధీమా**



తాడిపత్రి నియోజకవర్గ ముఖచిత్రం




వైయస్ జగన్‌నే వెన్నుదన్నుగా భావించే కేతిరెడ్డి పెద్దారెడ్డి, జేసీ దివాకర్‌రెడ్డి దీవెనతో బరిలోకి దిగిన జేసీ అస్మిత్‌రెడ్డి

**తాడిపత్రి, మే 17, ప్రభాతవార్త:** ఇటీవల జరిగిన అల్లర్లతో తాడిపత్రి నియోజకవర్గం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ నియోజక వర్గ ఫలితంపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల వివరాలు తేలడంతో తమకు అనుకూలంగా ఉన్న ఓట్లను లెక్కేసుకుంటూ గెలుపుపై ప్రధాన పార్టీల్లోని కార్యకర్తల్లో ధీమా వ్యక్తమవుతోంది. అయితే తాడిపత్రిలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలతో గెలుపోటములపై ఇరు పార్టీల ద్వితీయ శ్రేణి, గ్రామస్థాయి నాయకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పోలింగ్ అనంతర అల్లర్లతో ఇళ్లకు దూరమవడంతో నాయకుల్లేని పల్లెలు దర్శనమిస్తున్నాయి. పోలీసు కేసులకు జడిసి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ గ్రామస్థాయి నాయకులు, సీనియర్ కార్యకర్తలు ఇళ్లకు, గ్రామాలకుదూరంగా ఉంటుండటంతో గెలుపోటములపై వారిలో మరింత ఉత్కంఠ నెలకొంది.

**- గెలిస్తేనే ఊరట..!**

ప్రస్తుతం నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రానున్న ఎన్నికల ఫలితాలు తమ పార్టీకి అనుకూలంగా వస్తేనే కొంత ఊరట ఉంటుందని ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు. మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, ఇతర వివరాలను సమీక్షిస్తూ విజయావకాశాలపై వారు చర్చించుకుంటున్నారు. గతంలో వచ్చిన మెజారిటీలను పరిగణలోకి తీసుకొని ప్రస్తుత పోలింగ్ శాతాలతో పోలుస్తూ లెక్కలేస్తున్నారు. జూన్ 4వ తేదీ ఎప్పుడొస్తుందా అంటూ అభ్యర్థుల కంటే నాయకులు, కార్యకర్తలే ఎక్కువ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన ద్వితీయశ్రేణి నాయకులు, సీనియర్ కార్యకర్తలు, సామాన్య కార్యకర్తలు తమ పార్టీ గెలవాలంటే తమ పార్టీ గెలవాలంటూ వేయి దేవుళ్లకు ముక్కుకుంటున్నారనే చర్చ జనంలో సాగుతోంది.

**- ఎవరి ధీమా వారిదే..!**

ఓటరు తీర్పు ఈవీఎంల్లో నిక్షిప్తమవడంతో ఫలితాలు రానున్న జూన్ 4 కోసం అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. నియోజకవర్గంలో 83 శాతం ఓటింగ్ జరగడంతో ఈ ఓటింగ్ ఏ పార్టీకి లాభం చేకూరుస్తుందో అనే దానిపై నియోజకవర్గంలో జోరుగా చర్చలు సాగుతున్నాయి. పెద్దవడుగూరు, యాడికి మండలాలతో పాటు తాడిపత్రి పట్టణం కూడా తమకే మెజారిటీ చూపుతుందని, తాడిపత్రి రూరల్, పెద్దపప్పూరు మండలాల్లో మెజారిటీ తక్కువ రావచ్చని వైకాపా నాయకులు, కార్యకర్తలు వాదిస్తుంటే తాడిపత్రి పట్టణంతో పాటు తాడిపత్రి రూరల్, పెద్దపప్పూరు, యాడికి మండలాల్లో కూడా తమకే మెజారిటీ వస్తుందని తెదేపా నాయకులు, కార్యకర్తలు వాదిస్తున్నారు. తాడిపత్రి గెలుపుతో పాటు ప్రభుత్వ ఏర్పాటు కూడా మాదంటే మాదని ఎవరికి వారు లెక్కలేస్తూ చర్చోపచర్చలు సాగిస్తున్నారు. వైయస్ జగన్‌తో పాటు సంక్షేమ ఫలాల లబ్ధిదారుల అండదండలతో బరిలోకి దిగిన కేతిరెడ్డి పెద్దారెడ్డిదా.., కూటమి బలిమితో పాటు జేసీ దివాకర్‌రెడ్డి దీవెనలతో బరిలోకి దిగిన అస్మిత్‌రెడ్డిదా గెలుపని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# అల్లర్లకు పాల్పడితే అవస్థలు తప్పవు



కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక పోలీసు బలగాలు



కవాతులో పాల్గొన్న పోలీసు ఉన్నతాధికారులు

**తాడిపత్రి, మే 17, ప్రభాతవార్త:** అల్లర్లకు పాల్పడితే ఎంతటివారికైనా అవస్థలు తప్పవని డీఎస్పీలు శివారెడ్డి, శ్రీనివాసులు శుక్రవారం పేర్కొన్నారు. ఇటీవల తాడిపత్రిలో చోటు చేసుకున్న అల్లర్లను దృష్టిలో ఉంచుకొని అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి ఆదేశాల మేరకు ఈ ఇద్దరు అధికారులు పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ప్రత్యేక కవాతు నిర్వహించారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరించకుండా సంయమనంతో ఉండాలని, పట్టణంలో అమలవుతోన్న 144 సెక్షన్‌కు అనుగుణంగా అయిదుగురి కంటే ఎక్కువ గుమిగూడకూడదని వారు పేర్కొన్నారు. తాడిపత్రిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు నుంచి ప్రారంభమైన ఈ ఏపీఎస్పీ బలగాల ప్రత్యేక కవాతు అశోక్‌పిల్లర్, బండమసీద్, వైయస్సార్ కూడళి, పుట్లూరు, యల్లనూరు రోడ్ల కూడళ్లు, ఆర్టీసీ బస్టాండు కూడళి వరకు కొనసాగింది. ప్రస్తుతం పట్టణంలో ప్రశాంత పరిస్థితులు నెలకొన్నాయని, ఇదే ప్రశాంతతను కొనసాంచేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని వారు కోరారు.

# ఎన్నికల హింసకు ఎన్నికల కమిషన్ బాధ్యత వహించాలి

**- తాడిపత్రి ఎమ్మెల్యే ఇంటిపై పోలీసుల దాడి అమానుషం -అర్బన్‌ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి**




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత, వైసీపీ నేతలు

**.అనంతపురం సిటీ, మే 17 ప్రభాతవార్త**

ఎన్కిల్లో జరిగిన హింస, అల్లర్లకు ఎన్నికల కమిషనే బాధ్యత వహించాలని అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా వైసీపీ కార్యాలయంలో, అనంతపురం, ఉరవకొండ, శింగనమల, వైసీపీ అభ్యర్థులు అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, వీరాంజినేయులు, శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్‌ఎన్డీయేకు మద్దతుగా పనిచేశ్వారన్నారు. ఎన్నికల మధ్యలో కూటమి అభ్యర్థులు ఇచ్చిన అధికారులను ఇష్టా రాజ్యంగా బదిలీ చేశారని ఆరోపించారు. ఆయా ప్రాంతాలపై ఎలాంటి అనుభవం లేని అధికారులను నియమించి సమర్ధ వంతమైన అధికారులను బదిలీ చేశారన్నారు. తాడిపత్రిలో 274 పోలింగ్‌కేంద్రాలు ఉన్నాయని అందులో 136 సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలు ఉన్నప్పటికీ ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఎన్నికల రోజు అల్లర్లు జరిగాయన్నారు. తాడిపత్రి ప్రాంతంలో నూతనంగా నియమితులైన ఎస్పీ ఎన్నికల పర్యవేక్షణ చేసినప్పటికీ ఎస్పీ కారుతోపాటు, ఎమ్మెల్యే పెద్దారెడ్డి కారుపై కూడా టిడిపి నేతలు రాళ్ల దాడి చేశారన్నారు. ముందస్తు వ్యూహంతోనే అడిషనల్ ఎస్పీ సహకారంతోనే పెద్దారెడ్డిపై దాడికి యత్నించారని విమర్శించారు. అంతేకాకుండా ఎన్నికల తర్వాత ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపై వందలమంది టిడిపి నేతలు ట్రాక్టర్లలో రాళ్ల తీసుకొచ్చి దాడి చేసినప్పటికీ అక్కడే ఉన్న పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పోలీసుల తోడ్పాటుకు నిదర్శనమని ఆరోపించారు. గతంలో తాను ఎన్నో ఎన్నికలు చూశానని, ఇంతటి విచక్షణ దాడులు తొలిసారి చూశానన్నారు. పెద్దారెడ్డి ఇంటిపై సాక్షాత్తు పోలీసులే దాడిచేసి అడ్డొచ్చిన పెద్దారెడ్డి సతీమణిని తోసివేసి కార్యకర్తలపై విచక్షణ రహితంగా దాడులు చేసి, సిసి కెమెరాలు, లైట్లు పగలగొట్టడం అప్రజాస్వామికం అన్నారు. అరెస్టు చేసిన వారిని చితకబాది కోర్టులో హాజరు పరిచారని, ఎన్నికల కమిషన్ స్వయంగా బాధ్యులైన ఎస్పీ, పోలీసులను సస్పెండ్ చేయడం వారు చేసిన తప్పులు ఒప్పుకోవడమేనన్నారు. ఈ ఘటనపై ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని, దాడులకు బాధ్యులైన ప్రతి అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశ్వారు. కేవలం ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నేతలు దాడులకు తెగబడ్డారన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. టిడిపి నేతలు అడ్డదారులు తొక్కి అధికారంలోకి రావాలన్న దురుద్దేశ్యంతో అరాచకాలకు పాల్పడుతున్నారన్నారని విమర్శించారు. సమర్ధవంతమైన డిఐజిని అవమానకరమైన రీతిలో బదిలీ చేశారన్నారు. ఎన్నికల కమిషన్ అవగాహన లేని అధికారులను నియమించిన ఫలితంగానే పోఇంగ్‌రోజు హింసకు ప్రేరేపించేందుకు దోహద పడ్డారన్నారు. సాక్షాత్తు ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేయడం అప్రజాస్వామికం అన్నారు. ప్రజాదరణ లేక ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ హత్యక ఏసులో ఉన్న నింధితులుగా ఉన్నవారిని ఏజెంట్లు నియమించుకుని, ఓటర్లలో భయోత్పాతం సృష్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఎన్నికల రోజు జరిగిన హింసకు ఎన్నికల కమిషన్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశ్వారు. శింగనమల వైసీపీ అభ్యర్థి వీరాంజినేయులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలుచేసి ప్రజల విశ్వాసం పొందారన్నారు. ప్రజా మద్దతుతో వైసీపీ మరోమారు ఎన్నికల్లో గెలుపొందే అవకాశం ఉండటంతో ఓటమి భయంతో కూటమినేతలు విధ్వంసాలకు పాల్పడే ప్రయత్నం చేశారన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికల కమిషన్ విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవడమేకాకుండా, అక్రమంగా వైసీపీ శ్రేణులపై బనాయించిన కేసులను తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, వైసీపీ సీనియర్‌నేతలు పామిడి వీరాంజినేయులు, రాగే పరుశురామ్, ఉరవకొండ వీరాంజినేయులు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి... డిపిఎంఓ

డి.హీరేహాళ్, మే 17 ప్రభాతవార్త:



పిహెచ్‌సిలో రికార్డులను పరిశీలిస్తున్న డిపిఎంఓ

వర్షాకాలం ప్రారంభమైంది సీజనల్ వ్యాధుల నివారణ పట్ల ముందస్తు ప్రణాళికతో జాగ్రత్తలు చేపట్టాలని డిపిఎంఓ రవిశంకర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన డి.హీరేహాళ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పిహెచ్‌సి వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించి ఆరోగ్య పరమైన పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఓపి రికార్డులు, ల్యాబ్ రికార్డులు, రోగులకు మందుల పంపిణీ రికార్డులు, సిబ్బంది హాజరు పట్టిక తదితర రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జి.శాంతకుమారి, పిహెచ్‌సి సిబ్బంది అలివేలమ్మ, ప్రతాప్, శివయ్య, శివకుమార్ పాల్గొన్నారు.



పిహెచ్‌సిలో మందుల పంపిణీని తనిఖీ చేస్తున్న డిపిఎంఓ...

# గౌరవ వేతన వ్యత్యాసాలను సవరించాలి

కళ్యాణదుర్గం టౌన్, మే 17 ప్రభాతవార్త



కోఆర్డినేటర్ చల్లా కిరన్

2024వ సంవత్సరం రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో విజయవంతంగా ముగించి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కి అనంతపురం జిల్లా వ్యాయామ సంఘం అభినందనలు తెలియజేశారు. ఎన్నికల విధులలో విధులు నిర్వహించిన ఎన్నికల సిబ్బందికి ఇచ్చే గౌరవ వేతనంలోని వ్యత్యాసాలను తొలగించవలసిందిగా అనంతపురం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కోరింది. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సిబ్బందికి ఇచ్చిన గౌరవ వేతనాలు ఆంధ్ర రాష్ట్ర ఎన్నికల సిబ్బందికి అందజేసిన గౌరవ వేతనాలలో వ్యత్యాసాలు ఉన్నట్లుగా తెలియజేస్తున్నాము. అంతేకాకుండా అనంతపురం జిల్లాలోని ఒక్కొక్క నియోజకవర్గానికి ఒక రకంగా వేతనాలు అందజేశారు. ఈ వ్యత్యాసాలను తొలగించి ఎన్నికల్లో పాల్గొన్న సిబ్బందికి అందజేయాలని కోఆర్డినేటర్ చల్లా కిరన్ చౌదరి కోరారు.

# విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు....ఏఐఎస్ఎఫ్

రాయదుర్గం, మే 17 ప్రభాతవార్త:



వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విద్యాహక్కు చట్టాన్ని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు తుంగలో తొక్కుతున్నారని ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా సహాయ కార్యదర్శి పి.ఆంజినేయులు ఆరోపించారు. పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ వెంకట రమేష్‌కు ఏఐఎస్ఎఫ్ నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గం పట్టణంలో ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లలో విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి ధనార్జునే ధ్యేయంగా ప్రైవేటు స్కూలు దందా నడుపుతున్నాయన్నారు. విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతూ ప్రభుత్వ నియమ, నిబంధనలను ఏమాత్రం కూటా పట్టించుకోకుండా తమ ప్రైవేట్ పాఠశాలల్లోనే మంచి విద్యాబోధన దొరుకుతుందని నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం చేస్తూ అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతున్నారన్నారు. ఎండాకాలం సెలవులు అనంతరం నిర్వహించాల్సిన అడ్మిషన్లు పాఠశాల సెలవుల్లోనే ప్రైవేట్ అడ్మిషన్లు పాఠశాలలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రైవేట్ అడ్మిషన్ల పై విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నీరుఎత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. రాయదుర్గంలో విద్యాశాఖ అధికారులు ఉన్నారా లేదా అంతు పట్టడం లేదన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు మూసుకున్న కళ్లు తెరిచి ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాలతో ప్రత్యక్ష ఆందోళనకు ప్రైవేట్ పాఠశాలలపై దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నవనీత్, మంతేష్, నవీన్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాలవ భరత్ జన్మదిన వేడుకలు

రాయదుర్గం రూరల్, మే 17 ప్రభాతవార్త:



కాలవ భరత్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న తెదేపా నాయకులు

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, రాయదుర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ యూత్ ఆధ్వర్యంలో నియోజకవర్గం నుండి అనేక మంది తెదేపా నాయకులు, కార్యకర్తలు హాజరై కాలవ భరత్‌కు పూలమాలలు, శాలువాతో ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అందరిని కాలవ భరత్ ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో కేక్ కట్ చేయించి స్వీట్లు అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి పెళ్లలు పడి వ్యక్తి మృతి....

గుమ్మఘట్ట, మే 17 ప్రభాతవార్త:



మృతి చెందిన రాజశేఖర్

మండల పరిధిలోని ఆర్.కొత్తపల్లి గ్రామ చెరువులో మట్టి పెళ్లలు పడి గలగల గ్రామానికి చెందిన రాజశేఖర్(58) అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు గలగల గ్రామానికి చెందిన రాజశేఖర్ ఆర్.కొత్తపల్లి చెరువులో ఇసుక తవ్వుతుండగా ఒక్క సారిగా మట్టి పెళ్లలు పడి అక్కడిక్కడే మృతి చెందాదన్నారు. మృతుడు నిత్యం ట్రాక్టర్లో కూలీ పనులకు వెళ్లేవాడని, పని నిమ్మితం చెరువులో ఇసుకను తవ్వుతుండగా మట్టి పెళ్లలు మీదపడి ఊపిరాడక అక్కడిక్కడే మృతి చెందాదన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న పయ్యావుల కేశవ్

-వేద ఆశీర్వచనంచేసి తీర్థప్రసాదాలు అందించిన వేద పండితులు



శ్రీవారి దర్శనానంతరం ఆలయం బయట టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, మే 17 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ ఉరవకొండ అసెంబ్లీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ శుక్రవారం కలియుగ వైకుంఠం తిరుమలలో వెంకటేశ్వరస్వామిను దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం సమయంలో ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం స్థానిక రంగనాయక మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు పయ్యావుల కేశవ్‌కు వేద ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వైకేపీ ఏపీయంలకు తీవ్ర గాయాలు

-నింబగల్లువద్ద ద్విచక్రవాహనాన్ని టాటా ఏస్ వాహనం ఢీకొన్న వైనం

-మెరుగైన చికిత్సకై 108లో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలింపు

ఉరవకొండ, మే 17 ప్రభాతవార్త



తీవ్రంగా గాయపడిన విడపనకల్లు ఏపీఎం రాంమోహన్



చికిత్స పొందుతున్న బెలుగుప్ప ఏపీఎం ఆంజినేయులు

మండల పరిధిలోని నింబగల్లు గ్రామం దాటిన తరువాత పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో డీఆర్‌డీఏ-వైకేపీ బెలుగుప్ప ఏపీఎం ఆంజినేయులు, విడపనకల్లు ఏపీఎం రాంమోహన్ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు తెలిపిన మేరకు వివరాల్లోకి వెళితే...విధి నిర్వహణలో భాగంగా ఉదయం ద్విచక్రవాహనంలో ఇరువురూ బెలుగుప్పకు వెళుతుండగా వారి వాహనాన్ని వెనుక నుండి టాటా యేస్ వాహనం బలంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వారిని 108లో ఉరవకొండ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు సూచనల మేరకు మెరుగైన చికిత్సకై జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరించారు. ప్రభుత్వాసుపత్రిలో వైకేపీ ఉరవకొండ ఏపీఎం శివయ్య, సీసీలు గాయపడిన ఏపీఎంలను పరామర్శించి వారిని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించడానికి ఏర్పాట్లు చేశారు.

# రుణాలు రెన్యూవల్ విషయంపై ఏపిజిబి మేనేజర్‌తో రైతు సంఘం నాయకుల వాగ్వివాదం

కనగానపల్లి, మే 17 ప్రభాతవార్త



డిప్యూటీ తహాశీల్దారు జీవి ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

మండలపరిధిలోని మామిళ్లపల్లి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో 2024-25 రుణాల రెన్యూవల్ చేసేందుకు 1బితోపాటు అడంగల్ కూడా కావాలని అలాగే రెవిన్యూ రికార్డుల్లో చిన్న చిన్న పొరపాట్లు ఉన్నా కూడా బ్యాంకు మేనేజర్ లాయర్ నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ కావాలని డిమాండ్ చేస్తున్నారని వీఆర్‌ఓ నుంచికాపి తీసుకొని తహాశీల్దార్ అటెస్టెడ్‌తో రెన్యూవల్ చేయాలని అదే విధంగా 1బి కాపీతోనే రెన్యూవల్ చేయాలని వన్‌బి రాని పక్షంలో విఆర్‌ఓ ఇచ్చే కాపీ తీసుకొని రెన్యూవల్‌కి సహకరించాలని రైతు సంఘం నాయకులు మేనేజర్‌తో రైతుల తరుపున మాట్లాడారు. అనంతరం మండల డిప్యూటీ తహాశీల్దార్ జీవి ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. పంట రుణాల రెన్యూవల్‌కి విఆర్‌ఓలు ప్రతి సచివాలయాల్లో అందుబాటులో ఉండి విఆర్‌ఓ కాపీకి తహాశీల్దార్ లేక డిప్యూటీ తహాశీల్దార్ ఆథరైజేషన్ కాపీ ఇవ్వాలని పంట రుణాల రెన్యూవల్‌కి రెవెన్యూ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు. అదే విధంగా మండల కేంద్రంలోని ఎస్‌బిఐ బ్యాంకులో పై పంట రుణాలు రెన్యూవల్ విషయంలో రైతులకు సహకరించాలని ఎస్‌బిఐ మేనేజర్‌కు రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కమిటీ కార్యదర్వగ సభ్యులు బెల్లం మహదేవ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి బాలగొంది మల్లికార్జున, రైతు సంఘం మండల అధ్యక్షులు నాగరాజు, సిపియం మండల కార్యదర్శి కదిరప్ప, రైతులు పాల్గొన్నారు.

# ఉరవకొండలో కురిసిన భారీ వర్షం..!

- ఎండ వేడిమి, ఉక్కపోతలకు ఉపశమనం

ఉరవకొండ, మే 17 ప్రభాతవార్త



ప్రధాన రోడ్డులో వర్షం కురుస్తున్నప్పటి దృశ్యం

ఉరవకొండ ప్రాంతంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ద్రోణి ప్రభావంతో సాయంత్రం 5 గంటల నుండి మొదలు 7 గంటల వరకు 2 గంటపాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గత రెండు, మూడు నెలల నుంచి భరించలేని ఎండ వేడిమి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించగా వాతావరణం చల్లబడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. భారీ వర్షానికి లోతట్టు కాలనీల్లో రోడ్లపైకి, సందుల్లో నీరు చేరింది. ఈసారి ఖరీఫ్ ప్రారంభంలోనే అల్పపీడన ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా భారీ వర్షానికి క్లాక్‌టవర్ చుట్టూ, ప్రైవేటు బస్టాండ్ లోతట్టు ప్రాంతంలో నీరుచేరి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.

# 23న వేసవి వికాసం శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం

- నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాటికొండ వెంకట్

ఉరవకొండ, మే 17 ప్రభాతవార్త



చిత్రలేఖనంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఈనెల 1వ తేదీ నుంచి నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగు నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు చేపట్టిన వేసవి వికాసం 21 రోజుల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం ఈనెల 23న గురువారం జరుగుతుందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాటికొండ వెంకట్ తెలిపారు. వేసవి సెలవులు వృధా కాకుండా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో 18 అంశాలైన యోగ, ఏరోబిక్ డాన్స్, భగవద్గీత శ్లోక పఠనం, నీతి కథలు, ముగ్గులు, షటిల్, సెపక్‌తక్రా, ఖోఖో, ఫుట్‌బాల్, రుబిక్ క్యూబ్, పజిల్స్, చదరంగం, తెలుగులో చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక పరిక్రియల్లో 20 మంది ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారన్నారు. శిక్షణకు 300 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని 21 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు వారు నేర్చుకున్న అంశాలపై పోటీలు నిర్వహించి ముగింపు రోజు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని వివరించారు.

# ఘనంగా మహాలక్ష్మికి వేడుకలు

అగళి, మే 17 ప్రభాతవార్త



రత్నగిరిలో వెలసిన పురాతన కొల్హాపురి మహాలక్ష్మి అమ్మవారి వేడుకలు రెండు నెలలుగా కొనసాగుతున్నాయి. ఇందులో ప్రత్యేకంగా శుక్రవారం రోజు అధిక సంఖ్యలో అగళి, రొళ్ల మండలాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. దేవి మూల విరాట్‌ను రంగు రంగు పూలతో పెద్ద ఎత్తున హారాలతో అలంకరించారు. ముఖ్యంగా గంగపూజ కోసం మహిళలు అధిక సంఖ్యలో వస్తుండటంతోపాటు గన్నేరు పూలను అలంకరించిన హారతులను మహాలక్ష్మికి చేపట్టి పూజలు చేస్తారు. దేవాలయం చుట్టూ మూడు ప్రదక్షిణల అనంతరం ఆ గన్నేరు పూలను దేవాలయం పైకి వేస్తారు. ఈ రత్నగిరి మహాలక్ష్మి అమ్మవారు చాలా పురాతనమైన వారు కావున వందల వేల నుంచి ఆనవాయితీగా వేడుకలు జరుగుతున్నాయి. ఇప్పుడైతే రవాణా సౌకర్యం ఉంది కానీ గత 50 సంవత్సరాల క్రితం కాలీ నడక ద్వారా అమ్మవారిని చేరి పూజలు నిర్వహించి హారతులు పట్టేవారు. ఇక్కడ నుంచి చద్దిని అక్కడకు తీసుకెళ్లి బుజించేవారు. మంగళ హారతి అనంతరం భక్తులకు ప్రసాదాన్ని వితరణ చేశారు.

# కమీషనర్‌కు రికార్డు అసిస్టెంట్ పిర్యాదుపై ఆర్జేడీ విచారణ..!

-రికార్డు అసిస్టెంట్ డి.కళ్యాణి, ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణను విచారించిన ఆర్జేడీ -విచారణ పూర్తి నివేదికను కమీషనర్‌కు అందజేస్తానన్న ఆర్జేడీ డా॥డి.నాగలింగారెడ్డి

ఉరవకొండ, మే 17 ప్రభాతవార్త



ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విచారణ నిర్వహిస్తున్న దృశ్యం

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డి.కళ్యాణి కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ తనను మహిళ అనే గౌరవం కూడా ఇవ్వకుండా అందరి ముందు చెప్పడానికి వీలులేని భాషలో తిడుతూ మహిళల సమస్యల అవసరానికి సెలవు కూడా మంజూరు చేయకపోగా జీతం ఇవ్వకుండా, ఇంక్రిమెంట్ కూడా చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని తనకు న్యాయం చేయాలని ఉన్నత విద్య కమీషనర్‌కు పిర్యాదు చేసిన క్రమంలో శుక్రవారం స్థానిక కళాశాలలో కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) డా॥డి.నాగలింగారెడ్డి విచారణ జరిపారు. ఆర్జేడీ పిర్యాదుదారైన రికార్డు అసిస్టెంట్ డి.కళ్యాణి తోపాటు, ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణతో సమావేశమై వేరు వేరుగా స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ డా॥డి.నాగలింగారెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ ఇరువురిని విచారించి పూర్తి నివేదికను కమీషనర్‌కు అందజేస్తానన్నారు.

**రికార్డు అసిస్టెంట్ తన పిర్యాదులో ఏమన్నారంటే...**

తాను 2021 విద్యాసంవత్సరం నుండి కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నానని 2002లో సహాయకురాలిగా ఉద్యోగంలో చేరి 2008లో రికార్డు అసిస్టెంట్‌గా పదోన్నతిని పొంది విధులు నిర్వహిస్తున్నానని డి.కళ్యాణి తెలిపారు. ఇంగ్లీష్‌లో ప్రావీణ్యంలేని నేను లెటర్లను ఇంగ్లీషులో టైపు చేయడానికి ఇబ్బంది పడుతూ ఇతరుల సహాయంచేత పనులు చక్కబెడుతున్నానన్నారు. అయితే ప్రిన్సిపాల్ జి.రామకృష్ణ తనను మహిళ అనే గౌరవం ఇవ్వకుండా అందరి ముందు చెప్పడానికి వీలులేని భాషలో తిడుతున్నారన్నారు. ఈ రంగంలోకి రాకముందే ఇంగ్లీష్ నేర్చుకొని రావాలని లేదంటే ఉద్యోగం మానేయాలని దుర్భాషలాడారన్నారు. అనేకమార్లు అవమానానికి గురై ఆత్మహత్య చేసుకోవాలని అనిపించిందని అయితే అనారోగ్యంతో ఉన్న భర్త, పిల్లలు గుర్తుకు వచ్చి చస్తూ బ్రతుకుతున్నానన్నారు. స్త్రీల సమస్యల అవసరాలకు సెలవు కూడా మంజూరు చేయకపోగా డిసెంబర్ 2023 మెడికల్ లీవ్ పెట్టిన కారణంగా సర్టిఫికేట్ సబ్మిట్ చేసినా జీతం ఇవ్వలేదన్నారు. అంతే కాకుండా ఇంక్రిమెంట్ కూడా చేయలేదని, హాస్పిటల్ ఖర్చులకు జీపీఎఫ్ అప్లై చేసినా నిరాకరించారని తనకు న్యాయం చేయాలని కమీషనర్‌కు డి.కళ్యాణి తన పిర్యాదులో పేర్కొన్నారు.

**ప్రిన్సిపాల్ ఏమన్నారంటే...** కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ విలేఖరులతో మాట్లాడుతూ రికార్డు అసిస్టెంట్ కళ్యాణి తనకు కేటాయించిన చిన్నపాటి పనులు టీసీలు రాయడం, లీవ్ మెయింటనెన్స్, టపాల్ పనులు కూడా చేయరని, టీసీల్లో తప్పులు రాయడంవల్ల విద్యార్థులు, వారితల్లిదండ్రులు అనేకమార్లు తనకు పిర్యాదు కూడా చేశారని దీంతో మెమోలు ఇచ్చామన్నారు. ఆరోగ్యం బాగా లేదని మెడికల్ లీవ్‌ను అనుమతి లేకుండానే తీసుకొంటోందన్నారు. మాట్లాడే ప్రతి మాటలను మొబైలో రికార్డు చేసి కళాశాల విషయాల గూర్చి కళాశాలకు సంబంధంలేని బయటి వ్యక్తులతో మాట్లాడుతోందన్నారు. లీవ్ లెటర్ నేరుగా ఇవ్వకుండా మెయిల్ చెయడం లాంటివి చేస్తోందని ఇది సరైంది కాదని అన్నందుకు లేనిపోనివి కల్పించుకొని కమీషనర్‌కు ఆమె పిర్యాదు చేసిందన్నారు. ఆమె ఇదివరకు పనిచేసిన చోట ల్యాబ్‌లో పనిచేసిందని ఆమెకు పనిపట్ల ఎలాంటి అవగాహన లేదన్నారు. కళాశాలలో స్టాఫ్ తక్కువగా ఉండటంవల్ల ఆమెకు తప్పనిసరి పరిస్థితుల్లో పని అప్పగించాల్సి వస్తోందని ప్రిన్సిపాల్ తెలిపారు.

# తల్లిని చంపిన కేసులో కొడుకు అరెస్టు

- వివరాలు వెల్లడించిన కళ్యాణదుర్గం రూరల్ సిఐ నాగరాజు

కంబదూరు, మే 17 ప్రభాతవార్త



నింధితున్ని చూపుతున్న పోలీసులు

కుటుంబ కలహాలతో కన్నతల్లిని సొంత కొడుకు హతమార్చిన ఘటన బుధవారం కంబదూరు మండల పరిధజలో వైసిపల్లిలో చోటు చేసుకుంది. ఈ మేరకు సంబంధించి సుంకమ్మను చంపిన ఆమె కొడుకు వెంకటేషులును అరెస్టు చేశామని కళ్యాణదుర్గం రూరల్ సిఐ నాగరాజు తెలిపారు. కంబదూరు ఎస్సై ఆంజినేయులతో కలసి సిఐ వివరాలు వెల్లడించారు. సుంకమ్మ, రామదాసు దంపతులకు కొడుకు వెంకటేషులు ఉన్నట్లు ఇతను అనంతపురంలో ఉంటూ జీవనం సాగిస్తున్నట్లు పోలీసులు తె లిపారు. వీరికున్న స్థలం విషయంలో తల్లి, తండ్రి గొడవపడడంతో, తల్లి కట్టెతో తండ్రిని కొట్టగా ఈ విషయం తెలుసుకున్న వెంకటేష్ అనంతపురం నుంచి వైసిపల్లికి వెళ్లి తండ్రిని ఎందుకు కొట్టావంటూ నిలదీసినట్లు సిఐ చెప్పారు. తల్లి ఎదురు చెప్పడంతో వెంకటేష్ కోపంతో సుంకమ్మ తలను గ్యాస్ బండకు గుద్దడంతో చనిపోయిందని సిఐ అన్నారు. ఆమె భర్త దామదాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నింధితుడైన వెంకటేషులును అరెస్టు చేశామన్నారు.

# సర్వ భూపాల, సింహ వాహనాలలో దర్శనమిచ్చిన చెన్నకేశవుడు

ధర్మవరం రూరల్, మే 17 ప్రభాతవార్త



శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి వారి బ్రహ్మోత్సవ వేడుకలు భాగంగా ఈ నెల 15వ తేది నుంచి 25వ తేదీ వరకు 11 రోజులపాటు వివిధ రూపాల్లో భక్తులకు శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దర్శనం ఇస్తాడని ఆలయ ఈఓ వెంకటేషులు తెలిపారు. ఉభయ దాతలు, అర్చకులు, రథోత్సవ కమిటీ ద్వారా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ బ్రహ్మోత్సవాల వేడుకల్లో మూడు రోజులు శుక్రవారం ఉదయం అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, భాను ప్రకాష్, చక్రధర్ వేదమంత్రాలు మంగళవాయిద్యాలు నడుమ స్వామివారికి తొలిత పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం సింహ వాహనంలో ఆశీనులైన స్వామి వారిని రథోత్సవ కమిటీ, ఉభయ దాతలు, భక్తాదులు రతాన్ని లాగి ప్రారంభించారు. పట్టణంలోని భక్తాదులకు ఆయా వాహనాల్లో స్వామివారు దర్శనమిచ్చారు. దాతల పేరిటన ప్రత్యేక పూజలు వనర్చి, తీర్థప్రసాదాలతో పాటు దాతలను ఘనంగా రథోత్సవ కమిటీ అధ్యక్షుడు దాశెట్టి సుబ్రహ్మణ్యం అర్చకులు, భక్తాదుల నడుమ సత్కరించారు. ఈ ఊరేగింపులో అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పోరాళ్ల పుల్లయ్య బృందం ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు అందర్నీ ముగ్దుల్ని చేశాయి. ఈ కార్యక్రమంలో ఉభయ దాతలతోపాటు భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సంతాన సాఫల్యంలో అవగాహన ఎంతో ముఖ్యం.. డాక్టర్ పద్మ

ధర్మవరం రూరల్, మే 17 ప్రభాతవార్త



మాట్లాడుతున్న డాక్టర్ పద్మ

సంతాన సాఫల్యంలో అవగాహన ఎంతో ముఖ్యము అని దేవీ నర్సింగ్ హోమ్ నిర్వాహకురాలు డాక్టర్ పద్మా తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఎర్రగుంట లోని పార్థసారధి నగర్‌లో గల దేవీ నర్సింగ్ హోమ్‌లో ఉచిత సంతాన సాఫల్య అవగాహన శిభిరమును నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిష్ణాతులైన డాక్టర్ లావణ్య, డాక్టర్ పద్మావతిలతే వైద్య చికిత్సలను నిర్వహించి, పిల్లలు పుట్టకపోవడం అనేది చికిత్స చేయ తగిన మరొక వైద్య స్థితి అని వారు తెలిపారు. అనేకసార్లు గర్భస్రావాలు జరగడం, రిపోర్టులు మామూలుగా ఉన్నప్పటికీ గర్భం దాల్చకపోవడం, పిసిఓఎస్ సమస్యలు, ఫాలోపియన్ ట్యూబ్ పోవడం, తదతర కారణాలు ఉన్న వారికి ఉచితంగా స్కానింగ్ పరీక్షలు కూడా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ అవగాహన శిభిరంలో 80 మంది పాల్గొనడం జరిగిందని, వారందరికీ సంతాన సాఫల్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలో సిబ్బంది వెంకటేశ్వర్లు, నరేష్, వాసుదేవా, మహేశ్వరి, దిల్షాద్, రేవతి పాల్గొన్నారు.

# బిపీ అనే వ్యాధి పట్ల ప్రజలు నిర్ధారించుకోవాలి

ధర్మవరం రూరల్, మే 17 ప్రభాతవార్త



వైద్యాధికారి డాక్టర్ నరసింహులు

హైపర్ టెన్షన్ (బిపి) అనే వ్యాధి పట్ల ప్రజలు తప్పనిసరిగా నిర్ధారించుకొని తగిన వైద్య చికిత్సలను పొందాలని రిటైర్డ్ కంటి వైద్యాధికారి డాక్టర్ నరసింహులు పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ బిపి అనేది నేటి కాలంలో సర్వసాధారణమైందని తెలిపారు. ముఖ్యంగా ప్రజలు, గ్రామీణ ప్రాంతాలలో బిపి పట్ల నిర్లక్ష్యం ఉంటే పెద్ద ప్రమాదానికి గురికావాల్సి వస్తుందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అనుకూలమైన ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో బిపి నిర్ధారణ పట్ల మందులను ఉపయోగించుకోవాలని తెలిపారు. వైద్యుల యొక్క సలహాలతోపాటు వైద్య చికిత్సలను పొందుతూ సమయాను ప్రకారం విధిగా మందులు వేసుకోవాలని తెలిపారు. బిపి పట్ల తగిన వైద్య చికిత్సలతో పాటు మందులను వేసుకుంటే దీర్ఘకాలంగా జీవించే అవకాశం ఉందని తెలిపారు.ప్రతి ఆరు నెలలకు ఒకసారి తప్పక బిపి పట్ల నిర్ధారించుకోవాలని అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే అది ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని తెలిపారు.

# పేరుకుపోయిన చెత్త పట్టించుకునే వారే లేరా..?

అగళి, మే 17 ప్రభాతవార్త



పేరుకుపోయిన చెత్తా చెదారం..

అగళి బస్టాండ్ ప్రాంతంలో చెత్త పేరుకుపోయినా పట్టించుకునే వారే లేరా అని అగళి యువత ప్రశ్నిస్తోంది. జయరాం అనే యువకుడి, ఫోన్ షాపు ముందు, పక్కన విపరీతంగా చెత్త పేరుకుపోవడంతో దుర్గంధాన్ని వెద జల్లుతోందని, ఎవరూ పట్టించు కోవడం లేదని ప్రశ్నిస్తున్నాఏరు. బస్టాండ్ ప్రాంతంలోనే ఇలా ఉంటే మిగతా ఏరియా పరిస్థితి ఏంటని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పోయే వారు చెత్త కుప్పను చూస్తూ గుసగుసలాడుకుంటున్నారు. అందుకే సంబంధిత కార్యదర్శి చొరవ తీసుకుని పేరుకుపోయిన చెత్తను సత్వరమే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని అగళి యువత కోరుతోంది. మండల కేంద్రంలో మురికి కాలువలు లేకపోవడంతో చెత్తా చెదారాన్ని, మురికి నీటిని రోడ్లపైనే వేస్తున్నారని ఈ పద్దతి మానుకోవాలని అగళి సంత మార్కెట్‌లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఉందని, అక్కడికి ట్రాక్టర్ ద్వారా చెత్తను తరలిస్తున్నారు. కానీ బస్టాండ్ ప్రాంతంలో మాత్రం అధ్వానంగా చెత్త పడటం మూలంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత కార్యదర్శి చొరవ తీసుకుని సత్వరమే ఆ ప్రాంతంలోనిచెత్తను ఎత్తించాలని కోరుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో ఆ మురికి నీరు, అందులో మురికినీరు, చెత్త నీరు క లవడం మూలంగా దుర్ఘంధాన్ని వెదజల్లుతోందని, అక్కడి పరిస్థితిని చక్క దిద్దాలన్నారు.

# 22న ఉరవకొండ నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు

-ఉరవకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ బాలాజీ దయాల్

ఉరవకొండ, మే 17 ప్రభాతవార్త

ఉరవకొండ ఆర్టీసీ డిపో ద్వారా ఉరవకొండ పట్టణం నుంచి ఈనెల 22న అరుణాచలానికి ప్రత్యేక అల్ట్రా డీలక్స్ బస్సును నడుపుతున్నట్లు ఆర్టీసీ ఉరవకొండ డిపో మేనేజర్ బాలాజీదయాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉరవకొండ నుంచి అరుణాచలానికి ఫుల్ టికెట్టు 1660 రూపాయలుగాను, హాఫ్ టికెట్టు 870 రూపాయలుగాను నిర్ణయించడం జరిగిందన్నారు. ఇతర వివరాలను డిపో జీ ఏడీసీ శివ మొబైల్ నంబర్ 73828 64181కు సంప్రదించాలని కోరారు.

## గిరిజన గురుకుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

బుక్కరాయసముద్రం, మే 17 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ఆధ్రప్రవేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలురు) 2024=25 విద్యాసంవత్సరానికి గురుకుల పాఠశాల ప్రవేశంకొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ హర్జినాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆయన అందించిన వివరాలు తరగతులవారిగా ఇలా ఉన్నాయి. 3వ తరగతి కి 40 సీట్లుఖాలీగా ఉన్నాయి ఇందులో ఎస్‌టి 32, ఎస్సీ 5, బిసి 2, ఒసి 1, 4వతరగతి నుండి 9వ తరగతివరకు ఉన్న బ్యాక్‌లాగ్ ఖాళీలు 4వ తరగతి నందు 35, 5వ తరగతి 24, 6వతరగతి 15, 7వతరగతి 4, 8వతరగతి 13, 9వతరగతి 8 ఖాళీలు ఉన్నట్లు వారు తెలియజేశారు. బ్యాక్లాగ్ ఖాళీలను ఎస్టీ విద్యార్థులతో మాత్రమే భర్తీచేయబడును డిటిడబ్ల్యూఒ కన్వీనర్ ప్రిన్సపాల్ వారి ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థులను ఎంపిక చేయబడుతుంది దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 20లోపు దరఖాస్తుచేసుకోవాలని తెలియజేశారు.

## అనారోగ్యంతో శ్యామలమ్మ మృతి

### - కందికుంట పరామర్శ



శ్యామలమ్మ భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న కందికుంట

నల్లచెరువు, మే 17, ప్రభాతవార్త:

మండల కేంద్రంలో వీవర్స్ కాలనీ చెందిన టిడిపి నాయకులు రామ కృష్ణ సతీమణీ శ్యామలమ్మ (53) అనారోగ్యంతో బాధపడు తూ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందడం జరిగింది. విషయం తెలు సుకున్న కదిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ మృతురాలి నివాసంకి వెళ్ళి శ్యామ లమ్మ భౌతికకాయానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కందికుంటతో పాటు కన్వీనర్ రాజశేఖర్, సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ ఎద్దుల అంజి నప్ప, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మెన్ అశ్వర్థనాయుడు, కిరణ్ నాయకు లు, జక్కా లక్ష్మీనారాయణ, డివి వేణు తదితురులు శ్యామలమ్మ భౌకతికకా యానికి నివాళులు అర్పించారు.

## ఎన్‌పికుంటలో ఈ సంవత్సరం నుండి ఇంటర్మీడియట్ చదువులు

### - జెడ్పి హైస్కూల్ ఈ సంవత్సరం నుండి జెడ్పిహైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్
### - ఇంటర్మీడియట్‌కు అడ్మిషన్లు ప్రారంభం



పత్రికా ప్రకటన విడుదల చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

నంబులపూలకుంట, మే 17, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని జెడ్పి హైస్కూల్ 2024-25 సంవ త్సరానికి గాను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ అవ్వడం జరిగి ందని శుక్రవారం జెడ్పిహై స్కూల్ పాఠశాల ప్రధానో పా ధ్యాయులు తెలిపారు. కావున 2024-25 సంవత్స రానికి జెడ్పిహైస్కూల్‌లో ఇంటర్మీడ ియట్ అడ్మిషన్లు జరుతున్నాయనీ, యం పిసి గ్రూప్‌లో 40 సీట్లు, బైపిసి గ్రూప్‌లో 40 సీట్లు ఉన్నాయనీ, ఇంగ్లీషు మీడియంలో విద్యాభోదన జరుగు ననీ, ఈ అవకాశాన్ని మండల ంలోని విధ్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రదానోపా ద్యాయులు ఒక ప్రకటనలో తెలిపారు.

## వేరుశనగ విత్తన కాయల కోసం నేటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభం

### - మండల వ్యవసాయ అధికారి ఎన్.అన్వేష్‌కుమార్

శింగనమల, మే 17 ప్రభాతవార్త



ఏఓ అన్వేష్ కుమార్

.రైతులు వేరుశనగ విత్తన కాయల కోసం నేటి నుం చి ఆర్‌బికెలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల ఏఓ అన్వేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన పత్రి కా ప్రకటన విడుదల చేస్తూ మండలానికి ఖరీఫ్ సీజన్ కు గాను 1800 క్వింటాళ్ల కె-6 రకాం వేరుశనగ విత్తన కాయలు, 100 క్వింటాళ్లు కెఎల్- 1812 రకాం, 100 క్వింటాళ్లు సిసిజిఎస్-1694 రకం కేటాయింపు జరిగిం దని, శనివారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభం అవుతుం దన్నారు. ఒక బ్యాగు 30 కెజిలు, ఒక బ్యాగు మొత్తం ధర 2,850 కాగా రాయితీ ధర 1140, రైతు వాటాగా 1710 చెల్లించాలని ఆయన తెలిపారు.

## ఉత్తీర్ణులైన వారు టిసిసి సర్టిఫికెట్ పొందగలరు

అనంతపురం న్యూటౌన్, మే 17 ప్రభాతవార్త

టిసిసి-2023 జులై నెలలో జరిగిన పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు టెక్ని కల్ సర్టిఫికెట్ కోర్సు 2023 డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్‌గ్రేడ్ టెక్నికల్ పాస్ సర్టిఫికెట్లుపొందుటకు వారి సర్టిఫికె ట్‌లు జిల్లా విధ్యాశాఖ అధికారి కార్యాలయం కమలానగర్, అనంత పురంలో ఉన్నవి అభ్యర్థులకు తెలియజేశారు. కావున వారు వారి హాల్ టికెట్, రిజల్ట్ కాపీతో ఆపటు ఆధార్ కార్డు తీసుకొని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం కమలానగర్, అనంతపురంకు అభ్యర్థిలు హాజరై తీసుకోవల సిందిగా జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి తెలియజేశారు.

## వేగవంతంగా విత్తన వేరుశనగ సేకరణను చేపట్టాలి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం ఓల్డ్‌టౌన్, మే 17 ప్రభాతవార్త

విత్తన వేరుశనగ సేకరణను వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శింగనమల మండలంల ోని లోలూరు గ్రామం వద్దనున్న సాయి సీడ్స్ ఎంటర్‌ప్రైజెస్ గోడౌన్‌లో విత్తన వేరుశనగ ప్రొక్యూర్మెంట్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 8 విత్తన వేరుశనగ ప్రొక్యూర్మెంట్ కేంద్రాలు వుండగా బెలుగుప్ప, శింగనమల, గుత్తి మండలాల్లో ఒకటి చొప్పున మిగిలినవి అనంతపురం టౌన్‌లో వుండగా ఆయా కేంద్రాల్లో విత్తన వేరుశనగ సేకరణను వేవంగా చేయాలన్నారు. కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా విత్తన సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతగా విత్తనాలను సేకరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎన్ని రకాల విత్త నాలు వున్నాయి, ఏఏ రకాల విత్తనాలను పంపిణీ చేయనున్నారు, వేరుశనగ విత్తనాలను ఎన్ని ఎకరాల్లో సాగు చేయనున్నారో వివరాలు సేకరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, వ్యవసాయశాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఏపి సీడ్స్ డిఎం సుబ్బయ్య, వ్యవసాయ అధికారి రాకేష్, వ్యవసాయ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

## ఘనంగా శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

పుట్లూరు. మే 17 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని తహ శీల్దార్ కార్యాలయం సమీపం లోని శ్రీమద్విరాట్ పోతులూ రి వీరబ్ర హ్మేంద్రస్వామి ఆలయంలో శుక్ర వారం శ్రీవీ రబ్ర హ్మే ంద్రస్వా మి ఆరాధనను ఘనంగా నిర్వహిం చారు. పెద్దఎత్తున భక్తులు హాజరై శ్రీవీరబ్రహ్మేంద్రస్వామిని దర్శిం చుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, పూజారి నాగప్ప, ఎస్. పుల్లారెడ్డి, (బంకు), బి.రామాంజ నేయరెడ్డి, బిజెపి శింగనమల నియోజకవర్గం కో కన్వీనర్ కుందూ శ్రీనివా సులరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## వేరుశనగ విత్తనకాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

పుట్లూరు, మే 17 ప్రభాతవార్త

వేరుశనగ విత్తన కాయల కోసం మండలంలోని రైతులు ఈ నెల 18వతేదీలోపు ఆర్‌బికెలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసా యాధి కారి కాత్యాయిని తెలిపారు. పుట్లూరు మండలానికి ఖరీఫ్ సీజన్‌కు సంబ ంధించి 100 క్వింటాళ్లు (కె-6 రకం) విత్తనకాయలు కేటాయించడం జరిగిం దన్నారు. శనివారం నుండి రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుందన్నారు. వేరుశనగ కాయలు 30 కిలోల బస్తా మొత్తం ధర 2850 రూపాయలు కాగా 1140 రూపాయలు రాయితీపోగా రైతు వాటా 1710 రూపాయలు చెల్లించాల్సి

-----

వుంటుందన్నారు. అదే క్వింటాల్ ధర 9500 రూపాయలు కాగా 40 శాతం సబ్సిడీ 3800 రూపాయలు పోగా రైతు వాటా 5700 రూపాయలు చెల్లించాల్సి వుంటుందన్నారు. కావునా వేరుశనగ కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలియచేశారు.

## భర్త తిరిగిరాలేదని ఫిర్యాదు

పుట్లూరు, మే 17 ప్రభాతవార్త



రామాంజనేయులు (ఫైల్‌ఫోటో)

మండలంలోని నారాయణపల్లి గ్రామానికి చెందిన జెండా రామాంజనేయులు అనే వ్యక్తి ఇంటికి తిరిగిరాలేదని అతని భార్య జెండా నాగలక్ష్మి శుక్రవా రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పని నిమిత్తం చెన్నైకి వెళ్లి వస్తానని చెప్పి ఈ నెల 2వతేదీన వెళ్లిన తన భర్త ఇప్పటి వరకు ఇంటికి తిరిగి రాలేదన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## నీటిని సరఫరా చేయాలని సచివాలయం ముట్టడి



ఖాళీ బిందెలతో సచివాలయాన్ని ముట్టడించిన మహిళలు

పుట్లూరు, మే 17 ప్రభాతవార్త

మండలంలోని కందికాపుల గ్రామంలో నీటిని సరఫరా చేయాలని గ్రామ మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో సచివాలయాన్ని ముట్టడిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల వరకు రోజు మార్చి రోజు నీరు సరఫరా చేసేవారన్నారు.

ఎన్నికలు ముగిశాక నీటి సరఫరా చేయడం లేదంటూ పంచాయతీ కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డిని నిలదీశారు. ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తామని పంచాయతీ కార్యదర్శి హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించి వెళ్లిపోయారు.

## 20న జిందాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేఖంగా బృహత్ ప్రతిఘటన

బళ్లారి, మే17, ప్రభాతవార్త; జిల్లాలోని సందూరు తాలూకా తోరణగల్ వద్ద గల జిందాల్ ఉక్కు కర్మాగారం (జేఎస్‌డబ్ల్యూ)లో జరిగిన ప్రమాదంలో నలుగురు యువ ఇంజనీర్లు మరణించిన ఘటనను ఖండిస్తూ ఈనెల 20వ తేదీన జిందాల్ స్టీల్ ప్లాంట్ ఎదుట బృహత్ ప్రతిఘటన చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జె.సత్యబాబు తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన పత్రికాగోష్టిలో మాట్లాడిన ఆయన ఈ ప్రాంతం ప్రజలు ఎదుర్కొంటున్న కష్టనష్టాలు పరిష్కరించాలన్న కారణంతో తోరణగల్‌లో విజయనగర ఉక్కు ఫ్యాక్టరీ ప్రారంభించడం జరిగింది. కాలక్రమేణా కేంద్ర ప్రభుత్వం ప్రయివేట్ కంపెనీలకు ఉక్కు కర్మాగారం స్థాపనకై స్వాధీన పరుచుకున్న భూమిని కేటాయించడంతో జిందాల్ కంపెనీవారు జేఎస్‌డబ్ల్యూ ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారని, అయితే జిందాల్ కంపెనీ వారు ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు తగురీతిలో రక్షణ, భద్రత చర్యలు తీసుకోవడంలో విఫలమైనందున ఉక్కు ఫ్యాక్టరీలో ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనికి కారణం జిందాల్ యాజమాన్యం నిర్లక్ష్యమేనని ఆరోపించారు.

ఈనెల 9వ తేదీన ఫ్యాక్టరీలో నీటితొట్టెల వద్ద లీకేజీ పరిశీలించేందుకు వెళ్లిన నలుగురు యువ ఇంజనీర్లు తమ కార్యంలో నిమగ్నమైన సందర్భంలో భారీ పైపు నుంచి నీరు వేగంగా వచ్చి తొట్టెల్లోకి పడడంతో ఆ ఉధృతికి పనిలో ఉన్న నలుగురు యువకులు కొట్టుకుపోయి నీటితొట్టెల్లో పడిపోయారు. దీంతో వారు బయటకు రాలేక జలసమాధి అయ్యారని, దీనికి స్పష్టంగా జిందాల్ యాజమాన్యం నిర్లక్ష్యమేనని సత్య బాబు ఆరోపించారు. ఈ ఘటనలో హొస్పేట తాలూకా భువనహళ్లికి చెందిన గంటే జడెప్ప(31), చెన్నైకి చెందిన శివమహాదేవ్(22), బెంగళూరుకు చెందిన సుశాంత్‌క్రిష్ణనైనా(23) అనే యువ ఉద్యోగులు మరణించారని, కార్మిక సురక్షిత చట్టాలు ఏమీ సదరు ఫ్యాక్టరీలో అమలు జరగడంలేదని, ఫ్యాక్టరీల చట్టం 1948 పూర్తిగా ఉల్లంఘించడం జరిగిందన్నారు. ఈ ఘటనలో కేవలం ఆరు మంది అధికారులపై పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారని, అయితే జిందాల్ యాజమాన్యంపై కేసు నమోదు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు.




పత్రికాగోష్టిలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జె.సత్యబాబు తదితరులు

జరిగిన ఘటనకు నిరసగా తాము ఈనెల 20వ తేదీన సంయుక్త కార్మిక సంఘాలతో కలిసి ప్రతిఘటన జరుపుతున్నట్లు, కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రతిఘటనలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఎం.చెన్నబసయ్య, జాయింట్ సెక్రటరీ ఎం.తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు సోమప్ప, కర్ణాటక ప్రాంత రైతు సంఘం జిల్లాధ్యక్షుడు వి.ఎస్.శివశంకర్, జనవాది మహిళా సంఘం జిల్లా సంచాల కురాలు చంద్రకుమారి, డీవైఎఫ్ఐ జిల్లాధ్యక్షుడు ఎర్రిస్వామి, నాయకులు హనుమంత, అంగన్‌వాడీ నౌకర్ల సంఘంకు చెందిన రాణిఎలిజబెత్, టి.ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బళ్లారిలో రెయిన్‌బో మేఘ ఫన్ ఫేర్ ఎగ్జిబిషన్ ప్రారంభం



పత్రికాగోష్టిలో వివరాలు తెలుపుతున్న ఫన్ ఫేర్ ఎగ్జిబిషన్ నిర్వాహకులు రియాజ్‌అహ్మద్, మనోహర్, శ్రీరామచంద్రమూర్తిలు

బళ్లారి, మే17, ప్రభాతవార్త; నగరంలోని రేడియో పార్క్ ప్రాంతంలో ప్రభుత్వ ఐటీఐ కాలేజీ గ్రౌండ్‌లో మేఘ ఫన్ ఫేర్ ఎగ్జిబిషన్ ప్రారంభించినట్లు మేనేజర్ రియాజ్‌అహ్మద్ తెలిపారు. ఎగ్జిబిషన్ ప్రాంగణంలో శుక్రవారం పత్రికాగోష్టిలో మాట్లాడిన ఆయన ఈసారి తమ ఎగ్జిబిషన్‌లో విలక్షణమైన పెంపుడు జంతువులతోపాటు విదేశీ జాతుల వివిధ రకాల పక్షుల ప్రదర్శన ఉంటుందన్నారు. ఎగ్జిబిషన్‌లో మాట్లాడే పక్షిగా గుర్తింపు ఉన్న మెకావ్ పక్షితో పాటు విదేశీ జాతికి చెందిన ఊసరవెళ్లి(ఇగోనో) షుగర్ ల్యాండర్(ఎగిరే ఉడత), ఈము పక్షులు, లవ్ బర్డ్స్ వివిధ రకాల చిలుకలతోపాటు వివిధ దేశాలకు చెందిన కోళ్లు, కుక్కలు, పాములు, కొండచిలువ తదితరఇ వన్యజీవులు ప్రదర్శనలో సందర్శకులకు కనువిందు చేస్తాయని చెప్పారు. ఎగ్జిబిషన్‌లో ప్రధానంగా వివిధ రాష్ట్రాల చేనేతకారులు ఉత్పత్తి చేసిన వస్త్రాలు, బెడ్‌షీట్లు, మహిళల గృహోపయోగ వస్తువుల తోపాటు అలంకరణ సామగ్రి, కిచెన్, గార్డెన్‌కు అవస రమైన వస్తువుల స్టాళ్లు ఉంటాయని, వివిధ రకాల నిత్యం ఉపయోగించే ఉపకరణాలు అందుబాటులో ఉంటాయని, చిన్నపిల్లల మనోవిల్లాసానికై వాటర్‌బోట్, మినీ ట్రైన్, జాయింట్ వీల్, కొలంబస్ తదితర ఆట వస్తువులు ఉంటాయని, నార్త్ ఇండియన్, సౌత్ ఇండియన్ స్టైల్ వంటకాలైన వివిధ ఉపహారాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఎగ్జిబిషన్ ప్రదర్శన ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుందని తెలిపిన ఆయన, సార్వజనికులు సెలవుదినాలైనందున తమ పిల్లలతో ఎగ్జిబిషన్‌ను సందర్శించి ఆటవిడుపు పొందాలని రియాజ్‌అహ్మద్, యజమాని చందు తెలిపారు. ఈ సందర్భంలో ఆర్.మనోహర్, శ్రీరామచంద్రమూర్తి, జాకీర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, SHAIK AMANULLA S/o SHAIK MAHABOOB BASHA, Residing Door No-1-462-20-A, Gandhinagar, Kadiri Town, Sri Satya Sai District AP. Change my name from KOTAGASTI AMANULLA (Old Name) to **SHAIK AMANULLA** (New Name), Hence forth I am being called as **SHAIK AMANULLA** (New Name) for ALL PURPOSES.

## జిల్లాలో 37 వేల మంది రైతుల ఖాతాలకు రూ.41.40 కోట్లు కరవు పరిహారం జమ - జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి, మే17, ప్రభాతవార్త; జిల్లాను కరవు పీడిత ప్రాంతంగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలోని 36,944 రైతుల అకౌంట్లకు రెండు దఫాలుగా డీబీటీ ద్వారా రూ.41.40 కోట్లు జమ చేయడం జరిగిందని జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. 2023-24 సంవత్సరపు ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని 5 తాలూకాలను కరవు పీడిత తాలుకాలకు ప్రభుత్వం గుర్తించింది.

అనావృష్టి కారణంగా హానీకి గురైన పంటలు, పంట సమీక్ష జరిపి ఫ్రూట్స్ ఐడీ కలిగిన భూముల పహణీ లింక్ చేసిన రైతులకు డీబీటీ ద్వారా ఎస్‌డీఆర్‌ఎఫ్ మార్గ సూచిక ప్రకారం ఇప్పటికే 9 కంతుల్లో మొదటి కంతుగా రూ.2 వేలు చొప్పున మొత్తం 36,944 మంది రైతులకు రూ.7.26 కోట్లు పంట నష్టపరిహారాన్ని పంపిణీ చేశామన్నారు. రెండో దఫాలో జిల్లాలోని అర్హులైన 31,351 మంది రైతులకు రూ.34.03 కోట్లు పంపిణీ చేస్తూ రైతుల ఖాతాలకు జమ చేసినట్లు వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో రెండు దశల్లో మొత్తం 36,944 మంది రైతులకు రూ.41.30 కోట్లు జమ చేసినట్లు ప్రశాంత్‌కుమార్ మిశ్రా వివరించారు. డబ్బు అందని రైతులు ఎవరైనా ఉంటే జిల్లా, తాలూకాస్థాయి హెల్ప్‌లైన్ కేంద్రాల్లో సందర్శించి అక్కడి సెల్ ఫోన్ నంబర్‌లకు ఫోన్ చేసుకోవచ్చునని చెప్పారు.



రైతులకు కరవు పరిహారం వివరాలు తెలుపుతున్న జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపుకు శ్రమించాలి

### - ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లా బీజేపీ నాయకులతో మాజీ మంత్రి శ్రీరాములు

బళ్లారి, మే17, ప్రభాతవార్త; కళ్యాణ కర్ణాటక ప్రాంతంలో ఏడు జిల్లాలు శైక్షణికంగా అభివృద్ధి చెందడానికి ఈశాన్య పట్టభద్రుల క్షేత్రం ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అమరనాథ్ పాటిల్‌ను గెలిపించాల్సి ఉన్నదని మాజీ మంత్రి బి.శ్రీరాములు తెలిపారు. నగరంలోని ఎస్పీ సర్కిల్ వద్ద గల బీజేపీ కార్యాలయంలో జూన్ 3వ తేదీన జరిగే కర్ణాటక విధానపరిషత్ ఈశాన్య పట్ట భద్రుల క్షేత్రం ఎన్నికల నేపథ్యంలో బళ్లారి సిటీ క్షేత్రం పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని మాట్లాడారు. అమరనాథ్ పాటిల్ గతంలో ఇదే క్షేత్రంలో పోటీ చేసి గెలిచి ఈ ప్రాంతం విద్యారంగ సమస్యల గురించి విధానపరిషత్‌లో గొంతు విప్పి పరిష్కారానికి కృషి చేసిన వ్యక్తి అని, విద్యారంగంలో మార్పుల కోసం అహర్నిశలు పోరాటం జరిపే వ్యక్తిగా అమరనాథ్‌పాటిల్‌కు పేరు ఉన్నదని, ఈసారి ఆయన గెలుపుకు పార్టీలోని నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు. ఇప్పటివరకు ఎమ్మెల్సీగా కొనసాగిన కాంగ్రెస్‌కు చెందిన చంద్రశేఖర్ పాటిల్ ఈ ప్రాంతంలో ఆయన గెలిచిన తర్వాత తిరిగి కనిపించలేదని, దీంతో ఉపాధ్యాయుల, లెక్చరర్ల సమస్యలు పరిష్కరించలేకపోయారని, ఇటువంటి వ్యక్తికి తిరిగి ఓటు వేస్తే ఏమాత్రం అభివృద్ధి జరగదని, తప్పనిసరిగా బీజేపీ అభ్యర్థి అమరనాథ్ గెలుపుకు మనమంతా శ్రమిద్దామని తెలిపారు. ఈ సభలో బీజేపీ నాయకులు వీరశేఖర్‌రెడ్డి, ఓబులేష్, వీరేష్‌గౌడ, మల్లన్నగౌడ, దమ్మూరు శేఖర్, మల్లికా ర్జున ఆచార్, రామంజిని, అడవిస్వామి, కేదార్‌స్వామి, అమర్‌నాథ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీ నాయకులతో చర్చిస్తున్న మాజీ మంత్రి బి.శ్రీరాములు

# లక్ష్మినరసింహుని పాద పావనం పెన్నహోబిళం..!!

## -20 నుంచి లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాలు -26న గరుడ వాహనోత్సవం, శ్రీవారి 'కళ్యాణోత్సవం' -28న లక్ష్మినారసింహుని బ్రహ్మ రథోత్సవం -చకచకా జరుగుతున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు


లక్ష్మినరసింహస్వామి మూలవిరాట్


ఉద్బవలక్ష్మి అమ్మవారి మూలవిరాట్


రథానికి మరమ్మ తులు చేసి సిద్ధం చేసిన దృశ్యం

ఉరవకొండ, మే 17 ప్రభాతవార్త

ఉరవకొండ మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాలు స్వస్తిశ్రీ శోభకృత్‌నామ సంవత్సరం వైశాఖ శుద్ధ ద్వాదశి ఈనెల 20వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం 31వ తేది శుక్రవారం వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. 20న మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామం నుండి శ్రీవారి ఉత్సవమూర్తులను పెన్నహోబిళం తీసుకురావడంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి కె.విజయ్‌కుమార్, తెలిపారు. 21న త్రయోదశి మంగళవారం ఉదయం ధ్వజారోహనం, రాత్రి ప్రాకారోత్సవం జరుగుతుందన్నారు. 22న చతుర్థశి బుధవారం ఉదయం సింహ వాహనోత్సవం, రాత్రి చంద్రప్రభ వాహనోత్సవం, 23న పౌర్ణమి గురువారం రాత్రి గోవాహన, శేషవాహనోత్సవాలు, 24న పాడ్యమి శుక్రవారం రాత్రి హంంవాహనోత్సవం, 25న విదియ శనివారం రాత్రి హనుమంత వాహనోత్సవం జరుగుతుందన్నారు. 26న తదియ ఆదివారం రాత్రి గరుడ వాహనోత్సవం, అనంతరం కళ్యాణోత్సవం జరుగుతుందన్నారు. 27న చవితి సోమవారం ఉదయం సూర్యప్రభ వాహనోత్సవం, రాత్రి ఐరావత వాహనోత్సవం జరుగుతుందన్నారు. 28న పంచమి మంగళవారం ఉదయం 10 గంటలకు మడుగుతేరు, సాయంత్రం బ్రహ్మ రథోత్సవం జరుగుతుం దన్నారు. 29న షష్టి బుధవారం రాత్రి అశ్వవాహనం, 30న సప్తమి గురువారం రాత్రి ధ్వజా అవరోహనం, 31న అష్టమి శుక్రవారం ఉత్సవ విగ్రహాలు పెన్నహోబిళం నుండి ఆమిద్యాలకు తరలి వెళుతాయని దీంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు.

**కూలిపోయిన రథానికి మరమ్మతులు :**

కాగా గత ఏడాది ఏప్రిల్ 29న మరమ్మతుల సమయంలో క్రేన్ పట్టుతప్పి కూలిపోయి ధ్వంసమైన రథానికి మరమ్మతులు పూర్తీ అయ్యాయి. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో కొత్త రథాన్ని లాగేందుకుగాను అధికారులు చర్యలు చేపట్టినా రథం నిర్మాణ పనులు ఆలస్యంగా ప్రారంభమైన దృష్ట్యా నూతన రథం నిర్మాణం ఇప్పట్లో పూర్తీ అయ్యే అవకాశాలు లేకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఒకవైపు శ్రీవారి నూతన రథం తయారి పనులు చురుగ్గా జరుగుండగా కూలిపోయిన పాత రథంను నిలబెట్టి దానికి మరమ్మతులు చేసి ఈనెల 28న బ్రహ్మ రథోత్సవంరోజు లాగేందుకు సిద్ధం చేశారు. అయితే రథాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించి ట్రయల్ రన్ నిర్వహించి ఫిట్‌నెట్ సర్టిఫికేట్ ఇవ్వాల్సి ఉంది. కాగా గత ఏడాది కొత్తగా తయారు చేసిన చిన్నరథాన్ని తెచ్చి బ్రహ్మ రథోత్సవం నిర్వహించిన విషయం తెలిసిందే.

**ఆలయ సంక్షిప్త చరిత్ర :** అనంతపురం-ఉరవకొండ ప్రధాన రహదారికి ప్రక్కన పెన్నానదికి 3 కిలోమీటర్ల దూరమునవున్న గిరిపై పెన్నహోబిళ లక్ష్మినరసింహస్వామి దేవస్థానం వెలిసింది. ఈ గిరిపై పూర్వము ఉద్దాలక మహర్షి తపస్సు గావించినట్లు చరిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఈ గిరికి క్రింది భాగాన తూర్పుదిశకు గొల్లపల్లి అనే గ్రామం ఉండేదని ఈ గ్రామములో ఒకగోవు ప్రతిదినం బిలమువద్ద క్షీరము ఇచ్చేదని గోవు యజమాని తనగోవు పొదుగులో పాలు లేకుండుట గమనించి కలత చెందగా లక్ష్మినరసింహస్వామి ఆయనకు అగుపించి నేను నీ గోక్షీరమును సేవించుచున్నానని చెప్పగా గోయజమాని సంతోషభరితుడై బిలప్రాంతము శోధించగా బిలముపై భాగమున స్వామివారి పాదముద్రికగల శిలాఫలకము, క్రింది భాగమున నైరుతి దిశన లక్ష్మిదేవి అమ్మవారి శిల అగుపించిందని కథనం. గొల్లపల్లి వాసులు శ్రీవారికి, అమ్మవారికి చిన్న ఆలయాలు నిర్మించి పూజలు నిర్వహిస్తుండగా విజయనగర సామ్రాజ్యాధీశుడైన సదాశివరా యలువారు విజయనగరం నుండి పెనుగొండ దుర్గమునకు పయనించుచూ ఈ క్షేత్ర ము లో మజిలీ గాలించాడట. సదాశివరాయలువారికి స్వామివారు స్వప్న ములో కనిపించి తన జైత్రయాత్ర దిగ్విజయమవుతుందని ఆశీర్వది ంచినట్లు చెబుతారు. సదాశివరాయలువారు తన జైత్రయాత్రను ముగించుక ొని తిరుగు ప్రయాణంలో స్వామివారిని దర్శించి స్వామివారికి, లక్ష్మిదేవి అమ్మ వారికి ఆలయములు నిర్మించవలసినదిగా తన ఉదిరిపికొండ ప్రాంత ప్రతినిధికి ఆదేశించినట్లు చెబుతారు. లక్ష్మినృసింహస్వామి ఆలయపాలనకు పెన్నహోబిళ శోత్రియ గ్రామము దానముగా ఇచ్చినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ఉదిరిపికొండ ప్రాంత రాజప్రతినిధి ఆలయ నిర్మాణం గావించి ఏకశిలగల ద్వీపస్థంబముతో పాటు రాజుగారి గుర్తుగా ఏకశిల విజయస్తంభంను క్షేత్ర ము నందు ప్రతిష్టిం చా రు. దాదాపు 45 అడు గులపైబడి ఎత్తు గల రెండు శిలలు ఈ క్షేత్రంలో కనిపి స్తాయి. ఈ క్షేత్రం లో వెలసిన లక్ష్మి నరసింహస్వామి, లక్ష్మి దేవి అమ్మవారి స్వయం భువులు. ఈ క్షేత్రము పెన్నానది సమీపమున వెలసి యుండుట, స్వామివారి పాదముద్రిక క్రింది భా గమున బిళం ఉం దు టచేత ఈ క్షేత్రం పె న్నహోబిళం అని పిలు వబడుతోంది. క్రింది భాగమున అమ్మవారి ఆలయంలో గత 30 సంవత్సరాల నుండి పుట్ట అక్కడ వెలసిన శిల ఎత్తుగా పెరుగు చుండటం విశేషం.

**బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు :**

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ చెప్పారు. ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడారు. గత ఏడాది మరమ్మతుల సమయంలో రథం ఊహించని రీతిలో కూలిపోవడం తమను తీవ్రంగా కలిచివేసిందని అయితే భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ప్రత్యామ్నాయంగా తయారు చేసిన నూనత రథాన్ని తీసుకొచ్చి రథోత్సవం అందరి సహకారంతో దిగ్విజయంగా పూర్తీ చేయడం జరిగిందన్నారు. కొత్త రథం తయారి ఇప్పట్లో పూర్తీ కాదని పాత రథాన్ని మరమ్మతులు చేయించామన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు సమక్షంలో ట్రయల్ రన్ నిర్వహించి ఫిట్‌నెస్ సర్టిఫికేట్ పొందిన తరువాత 28న రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు.

# పల్లె కదిలింది...పట్టణం తడబడింది..!

## ః ప్రజాస్వామ్యాన్ని గెలిపించేందుకు పల్లెజనం పోటీ ః ప్రజాస్వామ్యం పట్ల పట్టణవాసుల్లో నిర్లిప్తత ఃగ్రామీణ ఓటర్లలో 86.44%, పట్టణ ఓటర్లలో 76.75% వినియోగం


ప్రజాస్వామ్యాన్ని గెలిపించేందుకు బారులుదీరిన గ్రామీణ ఓటర్లు


ఎండా గాలి..దుమ్ము ధూళిని లెక్కచేయక వరుసలో నిల్చున్న పల్లె ఓటర్లు

తాడిపత్రి, మే 17, ప్రభాతవార్తః పట్టణాలు, నగరాలు అంటే ఆధునికతకు అద్దంలాంటివనే భావన ఉంటుంది. అలాంటి ప్రాంతాలే గ్రామీణ ఓటర్లకు మార్గదర్శకంగా ఉండాలి. కానీ అందుకు విరుద్ధంగా ప్రజాస్వామ్యంలో ఈ ప్రాంత ఓటర్లే ఓటింగ్‌కు దూరంగా ఉండటం సరికాదనే అభిప్రాయం పౌర సమాజం నుంచి వ్యక్తమవుతోంది. ఇటీవల నాగ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గ ఓటర్లు 10,15,937 మంది ఓటింగ్‌లో పాల్గొనలేదు. ఇటీవల బెంగళూరు నగరంలోని మూడు నియోజకవర్గాల్లో 55 శాతం దాటని పోలింగ్ సరళి కూడా చర్చకు దారితీసింది. ఈ రెండు విషయాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఎక్కడో జరిగిన పోలింగ్ సరళి మనకు ఎందుకు అనుకోవడానికి వీలులేదు. మన జిల్లాలోనూ మరీ ముఖ్యంగా మన తాడిపత్రి నియోజకవర్గంలోనూ అందుకు సంబంధించిన ఆనవాళ్లు కూడా

**ఇటీవలి శాసనసభ ఎన్నికల పోలింగ్ సరళిలోనూ మనకు కనిపిస్తాయి.**

**ఃపోటెత్తుతున్న గ్రామీణులు**

ఏ ఎన్నికలు తీసుకున్నా పట్టణ ఓటర్లకంటే గ్రామీణ ఓటర్లే పోలింగ్ కేంద్రాలకు పోటెత్తుతున్నారు. పట్టణాల్లో ప్రజాస్వామ్యం పట్ల ఎందుకింత నిర్లిప్తత ఆవహించందంటూ చర్చ సాగుతోంది. తాడిపత్రి పట్టణంలో 87,090 మంది ఓటర్లుంటే 66,844 (76.75%) మంది ఓటర్లు మాత్రమే తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 20,246 మందికి ఓటుహక్కు వినియోగంపై ఆసక్తిలేదంటే ఆలోచించాల్సిన విషయమే. తాడిపత్రి నియోజకవర్గంలో 1,61,790 మంది గ్రామీణ ఓటర్లుండగా 1,39,857 (86.44%) మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవడం విశేషం. మొత్తం పట్టణ ఓటర్ల కంటే గ్రామీణ మహిళా ఓటర్లే 9.2% మంది ఎక్కువగా ఓటుహక్కును వినియోగించుకోవడం గమనార్హం.

**ఃఅదనంగా ఓటేసింది 16,467 మంది..!**

తాజాగా తాడిపత్రి నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 2,06,701 మంది ఓటేశారు. గత అసెంబ్లీ ఎన్నికలతో(1,90,234) పోలిస్తే 16,467 మంది ఎక్కువగా ఓటుహక్కు వినియోగించుకున్నారన్నమాట. తాడిపత్రి పట్టణం మినహా నియోజకవర్గం మొత్తం మీద 2014లో 79.64%, 2019లో 81.04%, 2024లో 86.44% వంతున ఓటుహక్కు వినియోగం పెరుగుతుండటం ఆశాజనకమేనని చెప్పవచ్చు. గ్రామీణ ఓటర్ల సంఖ్య పెరుగుతుండటంతో ఓటుహక్కు వినియోగ శాతం కూడా పెరుగుతోంది. ఈ ఎన్నికల్లో తాడిప త్రి పట్టణంలో 87,090 మంది ఓటర్లలో 66,844(76%) మంది, తాడిపత్రి మండలంలో 50,510 మంది ఓటర్లకు గానూ 42,868(84%) మంది, యాడికి మండలంలో 45,583 మందికి గానూ 37,881(83%) మంది, పెద్దపప్పూరు మండలంలో 28,115 మందికి గానూ 25,409(90%) మంది, పెద్దవడుగూరు మండలంలో 37,582 మందికి గానూ 33,699(89.6%) మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

# పథకాలపై అవగాహన పెంపొందిస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవాలి

## - ఎద్దులపల్లి ఆర్బీకేను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్


వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్


ఆర్బీకేలో వేరుశెనగ విత్తనాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్.

పామిడి, మే 17 ప్రభాతవార్త

ఆర్బీకేల ద్వార ప్రభుత్వం అందిస్తుస్తున్న పథకాలపై రైతుల్లో అవగాహన పెంపొందిస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిదిలోని ఎద్దులపల్లి రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ట్రైనీ కలెక్టర్ వినూత్నతో కలిసి ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అక్కడి వేరుశెనగ వితనాలను పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంపిణీ చేయటానికి ఆర్బీకేలకు చేరిన వేరుశెనగ వితనాలు ఎలావున్నాయి.. రైతులు వేరశెనగ పంటను మాత్రమే సాగు చేస్తున్నారా.. లేక ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపిస్తున్నారా.. రిజిస్ట్రేషన్ ప్రాసెస్ ఎలా జరుగుతుంది.. రైతులు ఏయే పంటలను సాగు చేసేందుకు ఇష్ట పడుతున్నా రంటూ.. ఆరా తీశారు. మండలంలో రైతులు వేరుశెనగ పంటతో పాటు కంది, కొర్ర, ఆముదం పంటలను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్న ట్లు మండల వ్యవసాయ అధికారిని లీనా వసుంధర జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌కు తెలియ జేశారు. విత్తన వేరుశెనగ పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని పొరపాట్లకు తావివ్వవద్దని సూచిస్తూ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే ఉపే క్షించబోమని ఆర్బీకే సిబ్బందిని హెచ్చ రించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమా మహేశ్వర మ్మ, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మినారాయణరెడ్డి, ఎస్ఐ రాజు, గ్రామ సర్పం చ వెంకటరమణమ్మ, పంచాయతీ కార్యదర్శి చంద్రమౌళి, విఆర్ఓ శాంత కుమారి, విలేజ్ సిరికల్చర్ అసిస్టెంట్ ఆదినారాయణ, రైతులు వీరాంజనేయులు, మధుసూదన్‌రెడ్డి, తిప్పారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఆదినారాయణ, ఆర్బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి యోగాసన పోటీల జడ్జెస్ శిక్షణ శిభిరం ప్రారంభం



శిక్షణ శిభిరం ప్రారంభంలో మాట్లాడుతున్న దృశ్యం

అనంతపురం, మే 17 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం నగరంలో రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకుగాను జడ్జెస్ శిక్షణ శిబిరము 17-5-2024 నుంచి 19-5-2024 వరకు వేమన టెలిఫోన్ భవన్‌లో గురువారం ఉదయం 10:30 గంటలకు ఎపి రాష్ట్ర యోగాసన సోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆర్‌డిటి స్పోర్ట్స్ డైరెక్టర్ శ్రీసాయి కృష్ణ, ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ డి.హరిచంద్రరామ, రాష్ట్ర అధ్యక్షులు ఎ.రాధికా, అనంతపురం యోగాసన స్పోర్ట్స్ చీఫ్ పాట్రన్ రవికాంత్, రమణ, అధ్యక్షులు, ఎం.రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి ఇన్ మారుతి ప్రసాద్, ఎన్.దివాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు రమణ, బాలసుబ్రహ్మణ్యం అనిల్‌కుమార్, అంతేకాకుండా శ్రీధర్‌రెడ్డి, సుమన, నిర్మల, శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర నలు మూలల నుంచి అధిక మంది జడ్జి ట్రైనింగ్ కార్యక్ర ములో పాల్గొన్నారు. యోగసన భరత్ అనే జాతీయ స్థాయి సంస్థ నిర్దేశం ప్రకారం కోడ్ ఆఫ్ రూల్స్‌లో శిక్షణ ఇవ్వబడును.

# నేటి నుంచి ఖరీఫ్ రాయితీ విత్తన వేరుశెనగ రిజిస్ట్రేషన్

## - మండల ఏఓ విజయ్‌కుమార్


మండల వ్యవసాయ అధికారి

కూడేరు, మే 17 ప్రభాతవార్త

జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల ప్రకారం మండల వ్యవసాయాధికారి విజయకుమార్ శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కూడేరు మండల వ్యాప్తంగా 12 గ్రామ సచివాలయ రైతు భరోసా కేంద్రంలో 12 శనివారం నుంచి ఖరీఫ్ 2024 సంవత్సరాలుగా రాయితీ వేరుశనగ విత్తన కాయల కోసం రిజిస్ట్రేషన్ జరుగుతుందని, కావాల్సిన రైతులు తమగ్రామ ఆర్‌బికె సిబ్బందితో తమ ఆధార్ కార్డు పట్టాదార్ పాస్ పుస్తకాలు తీసుకవెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవలసినదిగా మండల రైతులకు తెలియచే యమైనది. అర్ధ ఎకరా వరకు ఒక బ్యాగు 30 కెజిలు, ఒక ఎకరాకు రెండు బ్యాగులు 60 కెజిలు, ఎకరా పైన ఎన్ని ఎకరాలు ఉన్న ఆ రై తుకు 90 కేజీలు మూడు బ్యాగులు ఇవ్వబడుతుందని, అలాగే 30 కెజీలు ఒక బ్యాగ్ ధర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడి పోను 1,710 రూపాయలు కాగా, మొత్తం మూడు బ్యాగుల కుగాను 5130 రూపాయలు రైతు చెల్లించాల్సి ఉంటు oదని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. కావున అవసరం ఉన్న ప్రతి రైతు, రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన రైతులను కోరారు.

### ల్యాండ్ టైటిలింగ్ యాక్టును టిడిపి, ఎన్నికలలో దుష్ప్రచారానికి వినియోగించుకున్నదని తేల్చిన నీతి అయోగ్ - కెవి.రమణ


కెవి.రమణ

అనంతపురం, మే 17 ప్రభాతవార్త బ్యూరో

ల్యాండ్ టైటిలింగ్ యాక్టును కేంద్ర భూవనరుల శాఖతోపాటు, అన్ని రాష్ట్రాలకు పంపించామని, నీతి అయోగ్ స్పష్టం చేసిందని అయితే ఇటువంటి దానికి టిడిపి ఎన్నికల్లో దుష్ప్రచారానికి వినియోగించు కున్నదని కెవి.రమణ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా అన్ని రాష్ట్రాల కంటే ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇక్కడున్న భూ తగాదాలను దృష్టిలో ఉంచుకుని ఆదర్శవంతంగా ఈయాక్ట్‌ను అమ కెవి. రమణలు చేయడానికి, చిత్తశుద్ధితో పని చేసిందని తేటతెల్లమైందన్నారు. ఈ చట్టం వల్ల భూములన్నీ మరింత భద్రంగా ఉం టాయన్నారు. కానీ తను ఒకటి తలచిన దైవమొకటి తలచు అన్నట్లు చంద్ర బాబు కథ నాయనా పులి వచ్చె కథగా మారిపోయింది. ఇక రాష్ట్రంలో చంద్రబాబు నిజం చెప్పినా నాయనా పులివచ్చే కథలో బాలుడి పరిస్థితే అన్నారు.

### 3వ రోజు వేసవి శిక్షణ తరగతులు


శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు తదితరులు

అనంతపురం న్యూటౌన్, మే 17 ప్రభాతవార్త

జిల్లా కేంద్ర గ్రంథాలయం అనంతపురంలో 3వ రోజు వేసవి శిక్షణా తరగతులు సంస్థ కార్యదర్శి రమ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో యోగా వేంకటేశ్వరప్ప డ్రాయింగ్ హర్ష అనిల్ స్టోర్ టెల్లింగ్ మహేష్, మధు, నేర్పించారు. ముఖ్య అతిథిగా ఆర్కియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ రజిత మంచి నీతి కథలు, ఫండమె oటల్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ గురించి సందేశాత్మక ఉపన్యాసం ఇచ్చారు. ఇందులో సిబ్బంది కావేరి ఉజ్జినేశ్వరి ముత్యాలమ్మ, గంగాధర్ పాల్గొన్నారు.

# సిబిఎస్ఈ బోధనపై టీచర్లకు శిక్షణ


మాట్లాడుతున్న డిఈఓ బి.వరలక్ష్మి

అనంతపురం న్యూటౌన్, మే 17 ప్రభాతవార్త

నగర శివారు రాప్తాడు మోడల్ స్కూల్‌లో శుక్రవారం ఎంపిక చేసిన 115 మంది టీచర్లకు సిబిఎస్ఈ బోధనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఇఓ బి.వరలక్ష్మి హాజరై మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాలో ఎంపిక చేసిన మోడల్ స్కూల్స్, కెజిబివి స్కూల్స్, ఒక ప్రభుత్వ హై స్కూల్, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో సిబిఎస్ఈ అమలవుతుందన్నారు. సీబిఎస్ఈ విద్యను మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. అందలో భాగంగా సిబిఎస్ఈ అమలవుతున్న స్కూల్స్ టీచర్లకు రెండు విడతల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ నెల 17, 18 తేదీల్లో మ్యాథ్స్ ఫిజిక్స్ సైన్స్ టీచర్ల కు, 21, 22 తేదీల్లో సోషియల్, ఇంగ్లీస్ సబ్జెక్ట్ టీచర్లకు శిక్షణ ఇస్తున్నామ న్నారు. లెసన్ ప్లాన్ మ్యాడిల్స్ ఇదివరకే అందజేశామన్నారు. కోర్స్ డైరెక్టర్‌గా అనంతపురం డి ఎస్పీ డిఈఓ శ్రీనివాసరావు వ్యవ హరిస్తున్నారు. ఈ కార్యక్రమం లో గుత్తి డివైఈఓ శ్రీదేవి, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మజదేవి, తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా విత్తన వేరుశనగ సేకరణ చేపట్టాలి

## - జిల్లా కలెక్టర్ డా.బి వినోద్‌కుమార్


విత్తన వేరుశనక్కాయల నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్


ప్రాసెసింగ్ వవిధానంపై మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

శింగనమల, మే 17 ప్రభాతవార్త

విత్తన వేరుశనగ సేకరణను వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం మండల పరిధి లోని లోలూరు గ్రామం వద్ద ఉన్న సాయి సీడ్స్ ఎంటర్‌ప్రైజస్ గోడౌన్‌లో విత్తన వేరుశనగ ప్రొక్యూర్‌మెంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగాజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 8 విత్తన వేరుశనగప్రొక్యూర్‌మెంట్ కేంద్రా లు ఉండగాబెలుగుప్ప, శింగనమల, గుత్తి మండలాల్లో ఒకటి చొప్పున మిగిలిన అనంతపురం టౌన్‌లో ఉండగా ఆయా కేంద్రాల్లో విత్తన వేరుశనగ సేకర ణ వేగవంతం చయాలన్నారు. కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా విత్తన వేరుశనగ సేకరణ త్వరితగతిన పూర్తి చేయానలి నాణ్యమైన విత్తన సేకరణ చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల విత్తనాలు ఉన్నాయి, ఏఏ రకాల విత్తనా లను పంపిణీ చేయనున్నారు. వేరు శనగ విత్తనాలను ఎన్ని ఎకరాల్లో సాగు చేయనున్నారు తదితర విషయాలను జిల్లా కలెక్టర్ ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, వ్యవసాయ శాఖ జెడి ఉమా మహేశ్వరమ్మ, తహశీల్దారు సోబన్ బాబు, ఏపి సీడ్స్ డిఎం సుబ్బ య్య, వ్యవసాయ అధికారి రాకేష్, మండల వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్, ప్రాసెసింగ్ ప్లాంట్ ఏఓ శ్రీనివాసులు, ఆర్‌బికె సిబ్బంది, విహెచ్ఎ అఖిల తదితరులు పాల్గొన్నారు.

# ఎపిటిఎఫ్ 1938 జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక


ఎస్.రామానాయక్


ఆర్.శ్రీనివాస నాయక్

అనంతపురం న్యూటౌన్, మే 17 ప్రభాతవార్త

నగరంలోని ఉపాధ్యాయ భవనంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ సర్క్యులర్ మేరకు అనంతపురం జిల్లా నూతన కౌన్సిల్ సమావేశం నిబంధనల మేరకు అధికారుల అనుమతితో జిల్లా అధ్యక్షులు జి. రవీంద్ర అధ్యక్షతన ఎన్నికల పరిశీలకుడిగా ఏ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కౌన్సిల్ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్‌రెడ్డి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టడం జరిగింది. జిల్లా గౌరవ అధ్యక్షులుగా పివి.ప్రసాద్, జిల్లా అధ్యక్షులుగా ఎస్.రామానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆర్.శ్రీనివాస్ నాయక్, ఉపాధ్యక్షులుగా ఎస్.రామాంజినేయులు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సి.పోతులయ్య, అదనపు కార్యదర్శిగా డి.ఆంజినేయులు నాయక్, జిల్లా సబ్ కమిటీ సభ్యులుగా వజీర్ బాషా, సాయినాథ్‌రెడ్డి, బహేశ్వర, రామకృష్ణ, రమే ష్‌రెడ్డి, మద్దిలేటప్ప, అశోక్ నాయక్, నాగార్జున, నారాయ ణరెడ్డి, నరసిం హులును ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయ కులు, జిల్లా కౌన్సిలర్లు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య సభ్యులు పాల్గొనడం జరిగింది.

# అక్రమంగా పుస్తకాలు యూనిఫాం అమ్ముతున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలి

## - ఎస్ఎఫ్ఐ నాయకులు



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


కళాశాలలో పేరుమీద ముద్రించిన పుస్తకాలు

అనంతపురం న్యూటౌన్, మే 17 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా వ్యాప్తంగా 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పోరేట్ ప్రైవేటు విద్యా సంస్థలు అడ్మిషన్స్ చేస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఖాజా నగర్‌లో ఉన్న నారాయణ బాయ్స్ కళాశాల వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒతూరు పరమేష్ మాట్లాడుతూ.. అనం తపురంజిల్లా వ్యాప్తంగా 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే నారాయణ విద్యా సంస్థలు విద్య మాఫియా ప్రారంభమైందన్నారు. ఈ విషయం తెలిసిన ఉన్నత విద్యాశాఖ అధికారులు చూసి ఉన్నట్టుగా వ్యవహిస్తున్నారన్నారు. దీనికి ప్రత్యక్ష నిదర్శనం అనంతపురం నగరంలో నారాయణ కళాశాలలో అడ్మిషన్స్ నిర్వహిస్తున్నారన్నారు. దానితో పాటుగా కళాశాలలో కళాశాల పేరుతో ముద్రించినటువంటి పాఠ్యపుస్తకాలు యూనిఫాం విక్రయి స్తున్నారన్నారు. కళాశాలలతో కుమ్మక్కై చర్యలు తీసుకో కుండా వ్యవహరిస్తున్న ఆర్ఐఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్దు, గిరి సహాయ కార్యదర ్శి సూర్య పట్టణ భీమేష్, చందు ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటమి భయంతోనే టిడిపి నేతల దాడులు

## -వైఎస్ఆర్‌సిపి నియోజకవర్గ అభ్యర్థి ఎం.వీరాంజినేయులు


మాట్లాడుతున్న ఎం.వీరాంజినేయులు

శింగనమల, మే 17 ప్రభాతవార్త

ఓటమి భయంతోనే టిడిపి శ్రేణులు దాడులకు దిగుతున్నారని వైఎస్ఆర్‌సిపి నియోజకవర్గ అభ్యర్థి ఎం.వీరాంజినేయులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలో పత్రికా సమావేశంలో మాట్లాడుతూ.. తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపై జరిగిన దాడి పిరికి పంద చర్య అని, పోలీసులు ఇరు పార్టీలను సమన్వయం చేసి ఉంటే దాడులు జరిగేవి కావు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 2019లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజల గుండెల్లో విశ్వాసాన్ని నింపారు. జగన్ చేసిన మంచిని చూసి జీర్ణించుకోలేక చంద్రబాబు కూటమి ఓటమి భయంతో రాష్ట్రంలో దాడులకు తెర లేపారని ఆయన విమర్శించారు. జగన్ విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవా త్మక సంస్క రణలు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పతంలో నడిపించారన్నారు. అధికారం కోసం చంద్రబాబు ఏ చర్యలకైనా పాల్పడుతారని, అధికారం ఎవరి సొత్తు కాదని, రాష్ట్ర ప్రజలు ఎవరినినిర్ణయిస్తారో వారే అధికారంలోకి వస్తారని వారు తెలిపారు.